


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:112 | హైదరాబాద్ 23 నవంబర్ 2025, ఆదివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-112 | Hyderabad 23 November 2025, Sunday | Pages: 8, Rs. 5/-




## డ్రగ్స్-టెర్రర్ పై ఉమ్మడి పోరు

**జీ20 సదస్సులో ప్రపంచ దేశాలకు మోదీ పిలుపు**



- జీ20 వేదికలో ప్రారంభ సెషన్ లో ప్రధాని మోదీ ప్రసంగం
- 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ' ఏర్పాటుకు సూచన
- ఆఫ్రికాలో 10 లక్షల మంది శిక్షకుల తయారీకి ప్రత్యేక కార్యక్రమం
- ఆరోగ్యంపై గ్లోబల్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటుకు ప్రతిపాదన

ప్రపంచ అభివృద్ధి ప్రమాణాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దక్షిణాఫ్రికాలోని జోహాన్నెస్‌బర్గ్ లో శనివారం ప్రారంభమైన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. సుస్థిర ఆర్థిక వృద్ధి , సమ్మిళిత లక్ష్యంగా పలు కీలకమైన, వినూత్నమైన నాలుగు కార్యక్రమాలను అంతర్జాతీయంగా సరికొత్త మార్గాన్ని ఆయన ప్రదిపాదించారు. ...::: తరువాయి 3వ పేజీలో..

జీవో 46 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఎస్టీ రిజర్వేషన్లను మొదట ఖరారు చేసి, తర్వాత ఎస్సీ, బీసీలకు కేటాయింపు

ఎంపీడీఓ ఆధ్వర్యంలో వార్డు.. ఆర్డీఓ ఆధ్వర్యంలో సర్పంచ్ రిజర్వేషన్ల నిర్ణయం

## మూడు దశల్లో పంచాయితీ

**50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ**




గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 46 ను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. గ్రామ పంచాయతీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని ప్రభుత్వానికి సూచించింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళ రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు చేయనున్నట్లు సర్కార్ జీవోలో స్పష్టం చేసింది. సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, విద్య సర్వే 2024 జనాభా డేటా ఆధారంగా రిజర్వేషన్ కేటాయింపు ఉంటుందని పేర్కొంది.

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల విధివిధానలు ఖరారు చేస్తూ శనివారం నాడు ప్రభుత్వం జీఓ 46 విడుదల చేసింది. వార్డులు, సర్పంచుల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు కొత్త మార్గదర్శకాలు రూపొందించారు. ...::: తరువాయి 5వ పేజీలో..

51

## వందేళ్ల... ఆర్ఎస్ఎస్

### భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

**నాగ్‌పూర్ బీజం నుంచి విశ్వవ్యాప్త వటవృక్షం వరకు**

**శూన్యం నుంచి అనంతం వైపు సాగిన ఒక మహోద్యమ ప్రస్థానం**



కాలం ఎప్పుడూ నిశ్చలంగా ఉండదు. అది నిరంతరం ప్రవహిస్తుంది. కానీ, ఆ ప్రవాహంలో కొన్ని శతాబ్దాలు, కొన్ని దశాబ్దాలు చరిత్ర గతిని శాశ్వతంగా మార్చివే స్థాయి. భారతదేశ చరిత్రలో 20వ శతాబ్దం అటువంటి ఒక యుగసంధి. అది రాజకీయ పోరాటాల శతాబ్దం, స్వాతంత్ర్య సముపార్జన శతాబ్దం, ప్రజాస్వామ్య నిర్మాణం శతాబ్దం. కానీ, వీటన్నింటి అంతర్లీనంగా, ఈ శతాబ్దం భారతీయ ఆత్మను పునరుజ్జీవింపజేయడానికి జరిగిన ఒక నిశ్శబ్ద, కానీ శక్తివంతమైన సాంస్కృతిక విప్లవానికి సాక్ష్యంగా నిలిచింది. ఆ విప్లవానికి కేంద్ర బిందువు, చోదక శక్తి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS).

1925లో, ఆ శతాబ్దపు మొదటి పాదంలో, నాగ్‌పూర్‌లోని ఒక చిన్న మైదానంలో, డాక్టర్ కేశవ్ బలీరాం హెడ్గేవార్ అనే ఒక యుగద్రష్ట, కేవలం ఐదుగురు పిల్లలతో ఆడిన ఒక చిన్న ఆట, ఈ శతాబ్దం ముగిసేనాటికి (2000), కేవలం భారతదేశాన్నే కాదు, యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయగల ఒక మహాశక్తిగా, కోట్లాది మంది స్వయంసేవకులతో కూడిన ఒక విశ్వవ్యాప్త వటవృక్షంగా ఎలా ఎదిగింది? ఈ ప్రస్థానం, ఆధునిక ప్రపంచ చరిత్రలోనే ఒక అద్భుతం.

20వ శతాబ్దం ముగిసేనాటికి, సంఘ్ ప్రస్థానాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే (సింహావలోకనం), మనకు కనిపించేది కేవలం ఒక సంస్థ విస్తరణ కాదు. ...::: తరువాయి 2వ పేజీలో..



## ఓట్లేస్తేనే.. నిధులిస్తా...

ముంబై (ఏడీఎన్ఎన్) :

మహారాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ చర్చలకు దారితీశాయి. బారామతిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, ఓటర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. "ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత ఉండదు. హామీలను నెరవేర్చడంలో నేను వెనుకాడను. మీ దగ్గర ఓట్లు ఉన్నాయి. నా దగ్గర నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే, నేను కూడా తిరస్కరిస్తా!" ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ...::: తరువాయి 2వ పేజీలో..



## అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవం

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు**

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ...::: తరువాయి 2వ పేజీలో..


## సత్యసాయి ఆశీస్సులతో అగ్రస్థానంలోకి భారత్

పుట్టపర్తి (ఏడీఎన్ఎన్) :

పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ లో 44వ స్నాతకోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై, దేశ అభివృద్ధి దిశగా సత్యసాయి విద్యాసంస్థలు పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. "సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానంలోకి చేరుతుందని నేను ఆశిస్తున్నాను" అని తెలిపారు. ...::: తరువాయి 4వ పేజీలో..



## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు అరెస్ట్



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

తిరుగుబాటు కుట్ర చేశారన్న అభియోగాలపై బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో అరెస్ట్ అయ్యారు. శనివారం ఉదయం ఆయన్ను ఫెడరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని , రాజధాని బ్రెసిలియాలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు ఫెడరల్ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఆయనకు 27 సంవత్సరాలు శిక్ష పడగా, మరికొన్ని రోజుల్లోనే జైలుకు వెళ్లాల్సి ఉంది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా బోల్సొనారో పై చర్యలు తీసుకున్నామని ఫెడరల్ పోలీసు ఉన్నతాధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రెజిల్ లో జరిగిన 2022 ఎన్నికలలో ఓటమి పాలయ్యారు. ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించారు. ఆ సమయంలో వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు, మాజీ అధ్యక్షుడికి 27 ఏళ్ల శిక్ష విధిస్తూ ఈ సెప్టెంబర్‌లో తీర్పు వెలువరించింది. ...::: తరువాయి 3వ పేజీలో..



## విశిష్టమైన విద్యకు విద్యార్థులే ప్రతిరూపాలు

'విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను' - రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పుట్టపర్తి (ఏడీఎన్ఎన్) :

శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో 44వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విలువల ఆధారంగా వ్యక్తిత్వ నిర్మాణానికి శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ చేసిన కృషిని సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. "ఇక్కడి విద్యార్థులు భగవాన్ సత్యసాయి బాబా బోధించిన విశిష్టమైన విద్యా విధానానికి ప్రతిరూపాలు. ఈ విధానం విద్యార్థులను వృత్తిపరంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా పూర్తి వ్యక్తులుగా తీర్చిదిద్దుతుంది," అని పేర్కొన్నారు. పట్టభద్రులైన విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన సీఎం, సాయి సిద్ధాంతాన్ని జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మికవిద్యా కేంద్రాలలో ఒకటైన ఈ సంస్థ స్నాతకోత్సవం మహా వైభవంగా జరిగింది. ...::: తరువాయి 4వ పేజీలో..

## రేవంత్ సర్కారు ల్యాండ్ లూటింగ్ పాలసీ

- వేల ఎకరాలను పప్పు బెల్లాల్లా అమ్ముకునే కుట్ర
- మంత్రి శ్రీధర్‌బాబు బహిరంగ చర్చకు రావాలని సవాల్




హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

పారిశ్రామిక వాడల్లోని దాదాపు పది వేల ఎకరాల భూమిని రేవంత్ ప్రభుత్వం పప్పు బెల్లాల్లా అమ్ముకునే కుట్రకు తెరలేపిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అడ్డగోలు దోపిడీ మీదనే దృష్టి పెట్టారని, లగచర్ల కావొచ్చు, హెచ్ సీయూ భూములు కావొచ్చని రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తారు. ప్రజలకు ఏం చేయాలనే దోరణి కంటే కూడా, ఎక్కడ ఎంత దోపిడి చేయాలన్నదే రేవంతు ఆలోచన విధానం అన్నారు. శనివారం తెలంగాణ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో హరీశ్ రావు మాట్లాడుతూ, విలువైన భూములను కేవలం 30 శాతం తీసుకొని తెగనమ్ముతున్నడని, ఆయన అమ్మకాల రేవంత్ రెడ్డి అంటూ ఫైర్ అయ్యారు. 9292 ఎకరాల భూమిని 30 శాతం రిజిస్ట్రేషన్ ద్వారా కట్టబెడితే 5వేల కోట్లు వస్తుందని శ్రీధర్ బాబు చెప్పారంటే... ...::: తరువాయి 2వ పేజీలో..



## దానం నాగేందర్ రాజీనామా?

- అధిష్టానంతో సమాలోచనలు..
- ఆదివారంలోపు సమాధానం చెప్పాలని స్పీకర్ నోటీసులు...

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేయడానికి సంసిద్ధులయ్యారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో స్పీకర్ నోటీసులకు ఇప్పటివరకు సమాధానం ఇవ్వని దానం... రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికే మొగ్గుచూపుతున్నారని తెలుస్తోంది. బీఆర్ఎస్ టిక్కెట్ పై ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యేగా గెలిచి... కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఆయన... పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి నేరుగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లోకి ఫిరాయించారన్నది సుస్పష్టమైంది. మొత్తం 10 మంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని గులాబీ పార్టీ స్పీకరుకు ఫిర్యాదుతోపాటు, కోర్టులకు వెళ్లడం తెల్సిందే. ...::: తరువాయి 5వ పేజీలో..



## దమ్ముంటే ఆధారాలతో నిరూపించు లేదంటే క్షమాపణ చెప్పు

**హరీష్ రావు 'అవాస్తవాల'పై మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్**

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడం బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావుకు వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించిన వారు మరొకరు లేరని మరోసారి నిరూపించుకున్నారంటూ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. వారు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని మరోసారి స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని సవాలు విసిరారు. లేదంటే.. మీరు పదే పదే చేస్తున్న ప్రచారం కేవలం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశం అని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ...::: తరువాయి 2వ పేజీలో..



## రైతులు అరటి కూడా అమ్ముకోలేని పరిస్థితి

తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :

ఏపీ రాష్ట్రాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని, అరటిపంటను కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని తాడేపల్లి వైసీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ మంత్రి పేర్ని నాని శనివారం తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తి వైఫల్యాన్ని చూపుతోందని ఆరోపించారు. "కేంద్రంలో చంద్రబాబుకు భాగస్వామ్యం ఉన్నా కూడా ఏపీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఉన్నారు. రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి చింత కూడా లేదు," అలాగే అల్మట్టి డ్యాం ఎత్తు పెంపుపై కేంద్రం నిశ్శబ్దంగా ఉండటంపై కూడా ఆయన మండిపడ్డారు. గిట్టుబాటు ధరలు లేక పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, కొబ్బరి, పామాయిల్, ధాన్యం వంటి పంటలన్నీ నష్టాల్లోకి వెళ్లిపోయాయని రైతుల పరిస్థితి పై పేర్ని నాని ఆందోళన వ్యక్తం చేశారు. ...::: తరువాయి 4వ పేజీలో..

## ఉద్యమ బాట వీడి... జనజీవన స్రవంతిలో

**డీజీపీ ఎదుట 37 మంది మావోల లొంగుబాటు...**



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

మావోయిస్ట్ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. అగ్రనేతల ఎన్‌కౌంటర్ లతో కాకవికలం అవుతున్న క్రమంలో తెలంగాణ డీజీపీ సమక్షంలో భారీ సంఖ్యలో 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. హైదరాబాద్‌లో లొంగిపోయిన మావోయిస్టులతో శనివారం రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో కొనసాగుతూ అజ్ఞాతంలో పని చేసిన వీరంతా, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలవడానికి వారంతా వచ్చి లొంగిపోయ్యారని డీజీపీ తెలిపారు. ...::: తరువాయి 2వ పేజీలో..



## రాంలీలా నుంచి ఓట్ చోరీపై సమరం

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

కాంగ్రెస్ పార్టీ ,ఎన్నికల వ్యవస్థపై గత కొంతకాలంగా తీవ్రమైన విమర్శలు చేస్తూ వస్తోంది. బీజేపీ వరుసగా ఓట్ల దోపిడీ, ఎన్నికల ప్రక్రియలో అవకతవకల ద్వారానే అధికారంలోకి వస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్, డిసెంబర్ 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ చోరీ వ్యతిరేక మహా ర్యాలీ' నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ర్యాలీ ద్వారా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా హైలైట్ చేయాలని పార్టీ యోచిస్తోంది. ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొననున్నారు. ...::: తరువాయి 2వ పేజీలో..

సంక్షిప్త మనసర్కార్ Follow: manasarkar
ఆదివారం | హైదరాబాద్ 23.11.2025 www.manasarkar.com

# ఉద్యమ బాట వీడి... జనజీవన స్రవంతిలో

మొదటిపేజీ తరువాయి...
తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యడ సాంబయ్య అలియాస్ అజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రాలు ఉన్నారు. మిగతా వారిలో మరో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో వారిలో 25 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులలో ఇద్దరు తెలంగాణకు చెందిన వారు కాగా, మిగతా వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే ఉన్నారు. కొయ్యడ సాంబయ్య స్వస్థలం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దుల గూడెం. అప్పాసి నారాయణ పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణానికి చెందిన వారు కాగా మిగతా వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు. ఖమ్మం డివిజన్‌కు చెందిన ఏడుగురు మావోయిస్టులు తమ వద్ద ఉన్న 8 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి ఏకే 47 తుపాకీ, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు .303 తుపాకులు, ఒక జీ3 తుపాకీతో పాటు వివిధ క్యాలిబర్‌లకు చెందిన 346 తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ. 20 లక్షల రివార్డు.. అజాద్‌పై రూ. 20 లక్షల రివార్డు, అప్పాసి నారాయణపై రూ. 20 లక్షల రివార్డు ఉందని డీజీపీ చెప్పారు. ఆ రివార్డు చెక్కులను ఇదే వేదికపై వారికే డీజీపీ అందించారు. లొంగిపోయిన మావోయిస్టుల అందరిపై కలిపి రూ.1.41 కోట్ల రివార్డు ఉందని , అవి కూడా వారికి అందజేస్తామని తెలిపారు. అలాగే రివార్డుతో పాటు తెలంగాణ వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నట్లు శివధర్‌రెడ్డి చెప్పారు. సెంట్రల్ కమిటీలో ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హన్మంతు అలియాస్ ఊకె గణేశ్, పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ ఉన్నారని అన్నారు. మిగిలిన మావోయిస్ట్ సభ్యులు త్వరగా లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. పోలీసుల ముందుకు వచ్చిన వారికి పూర్తి భద్రత ఉంటుందని, ఎలాంటి వేధింపులు ఉండబోవని డీజీపీ శివధర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తాజా పరిస్థితులలో మావోయిస్టు పార్టీని దేవ్‌జీ లీడ్ చేస్తున్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఐబొమ్మ రవి పై కాదు... సైబర్ నేరాలు అపండి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :
పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్ట్ వ్యవహారం అనూహ్యంగా పొలిటికల్ యూ టర్న్ తీసుకుంది. ఈ అరెస్టుపై కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన సంచలన వ్యాఖ్యలు తీవ్ర దుమారంగా మారింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను లక్ష్యంగా ఆయన చేసిన ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. తిన్మార్ మల్లన్న మాట్లాడుతూ, ఐబొమ్మ రవి దమ్మున్నోడని, రవికి ప్రజల నుంచి మద్దతు ఉందన్నారు. "వంద రూపాయల టికెట్‌ను వేలల్లో అమ్ముకునే సినిమా వాళ్లు ఏమైనా సంసారులా?" అని మల్లన్న ప్రశ్నించారు. సినిమా ప్రముఖులతో కలిసి సీపీ సజ్జనార్ మీడియా సమావేశం నిర్వహించడంపై అభ్యతరం వ్యక్తం చేశారు. రవి భార్య సమాచారం ఇవ్వడంతోనే పోలీసులు సునాయాసంగా పట్టుకున్నారని ఆయన తెలిపారు. అయితే , మరోవైపు సీపీ సజ్జనార్ చేసేవన్నీ ఫేక్ ఎన్‌కౌంటర్లు అంటూ, వరంగల్‌లో చేసింది అదేనని మల్లన్న ఆరోపించారు. " దేశంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లు, కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలను నిరోధించాలంటూ " హితవు పలికారు. గతంలో సీవీ ఆనంద్ కూడా ఇలాంటి సైబర్ మోసాలు ఆగవని చెప్పిన విషయాన్ని మల్లన్న ప్రస్తావించారు. గత కొంతకాలంగా తలనొప్పిగా మారిన ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టుతో సినీ పరిశ్రమ వర్గాలు కొంతమేరకు ఊపిరిపీల్చుకున్నాయి. అధిక టికెట్ ధరల కారణంగా థియేటర్లకు వెళ్లలేని సామాన్యులు మాత్రం రవికి మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో మల్లన్న వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కొందరు మద్దతు ఇస్తే , మరికొందరు పోలీసు శాఖను అగౌరవపరిచారంటూ స్పందిస్తున్నారు. తిన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఇంకొందరు డిమాండ్ చేస్తున్నారు.



# జగన్, కేటీఆర్ బెంగళూరులో భేటీ

బెంగళూరు (ఏడీఎన్ఎన్) :
తెలుగు రాజకీయాల్లో శనివారం ఒక ఆసక్తికరమైన, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి , తెలంగాణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ఒకే కార్యక్రమంలో పక్కపక్కనే కూర్చోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బెంగళూరులో జరిగిన ఒక ప్రయివేట్ ఫంక్షన్‌కు ఇద్దరినీ అతిథులుగా ఆహ్వానించినట్టు సమాచారం.శనివారం సాయంత్రం జరిగిన ఈ వేడుకలో ఇద్దరూ హాజరై, ఒకే వరుసలో పక్కపక్కనే కూర్చొని కొద్ది సేపు ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా వారు నవ్వుతూ, సరదాగా సంభాషిస్తూ కనిపించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చాయి. ఈ చిత్రాలు బయటకు రావడంతో రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చలు చెలరేగాయి. ఇటీవల కాలంలో ఏపీ, తెలంగాణా రాజకీయాల్లో వేడెక్కిన వ్యాఖ్యలు, ఆరోపణలు చోటుచేసుకున్నా... ఈ కార్యక్రమంలో కనిపించిన స్నేహపూర్వక వాతావరణం అందరినీ ఆకర్షించింది. రాజకీయ నాయకులు వ్యక్తిగత వేడుకల్లో కలవడం సహజమే అయినా, ఇద్దరు ప్రముఖ నేతలు ఇంత రిలాక్స్‌డ్‌గా మాట్లాడుకోవడం ప్రత్యేకంగా మారింది. జగన్, కేటీఆర్ మధ్య ఈ స్వల్ప సంభాషణకు సంబంధించి ఎలాంటి అధికారిక వివరాలు బయటకు రాలేదు. అయితే ఇద్దరూ ఒకరికొకరు పరిచయం ఉన్న కుటుంబాలకే చెందినవారనీ, వ్యక్తిగత కార్యక్రమాల్లో కలుసుకోవడం కొత్తేమీ కాదని కొందరు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు, ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ సాగుతున్న రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈ సమావేశానికి ఏదైనా రాజకీయ ప్రాధాన్యం ఉందా? అన్న కోణంలో కూడా కొందరు విశ్లేషణలు చేస్తున్నారు. అంతేకాక, ఈ ఫోటోలు వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో కూడా చురుగ్గా చర్చ సాగుతోంది. కొందరు ఇది కేవలం వ్యక్తిగత సమావేశమని పేర్కొంటుండగా, మరికొందరు దీనికి రాజకీయ కోణం కూడా ఉండొచ్చని ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో జరిగిన ఈ ప్రయివేట్ ఫంక్షన్, తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో మాత్రం పెద్ద చర్చను రేపింది.



# నాగ్‌పూర్ బీజం నుంచి విశ్వవ్యాప్త వటవృక్షం వరకు

మొదటి పేజీ తరువాయి...
మనకు కనిపించేది -

- **ఆత్మవిస్మృతిలో** ఉన్న ఒక జాతి, తన అస్తిత్వాన్ని తిరిగి కనుగొన్న వైనం.
- **కులాల కుమ్ములాటలతో** చితికిపోయిన ఒక సమాజం, 'సమరసత' వైపు అడుగులు వేసిన వైనం.
- **రాజకీయ** బానిసత్వం నుంచి విముక్తి పొందిన దేశం, 'సాంస్కృతిక జాతీయవాదం' వైపు పయనించిన వైనం.
- **విపత్తుల** వేళ దిక్కుతోచని ప్రజలకు, 'సేవ' అనే అభయహస్తం లభించిన వైనం.

1999 నాటికి, అంటే 20వ శతాబ్దం చివరి నాటికి, సంఘ్ తన లక్ష్యసాధనలో ఎంత దూరం ప్రయాణించింది? అది సాధించిన విజయాలేమిటి? అది ఎదుర్కొన్న సవాళ్లేమిటి? అది జాతి నిర్మాణంలో పోషించిన పాత్ర ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానమే ఈ సమీక్ష. ఇది కేవలం గణాంకాల చిట్టా కాదు. ఇది మూడు తరాల స్వయంసేవకుల త్యాగాలకు, సర్ సంఘ్‌చాలక్‌ల దార్శనికతకు, కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలకు దక్కిన సాఫల్య పత్రం. ఇందులో, 1925 నుంచి 2000 వరకు సంఘ్ సాగించిన ఈ మహత్తర ప్రస్థానాన్ని, వివిధ రంగాలలో (సాంఘిక, రాజకీయ, సేవా, వైజ్ఞానిక) అది సాధించిన ప్రగతిని సమగ్రంగా, సానుకూల దృక్పథంతో విశ్లేషించుకుందాం.

సంస్థాగత విస్తరణ - శూన్యం నుంచి శిఖరం వరకు
ఏ సంస్థ ప్రగతినైనా ముందుగా దాని విస్తృతిని బట్టి అంచనా వేస్తారు. ఆ కొలమానంలో చూస్తే, సంఘ్ ప్రగతి అనూహ్యం, అసాధారణం.

**1. భౌగోళిక విస్తృతి – కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు:**
1925లో నాగ్‌పూర్‌కు మాత్రమే పరిమితమైన సంఘ్, 2000 నాటికి భారతదేశంలోని ప్రతి జిల్లాను, ప్రతి తాలూకాను, వేలాది గ్రామాలను స్పృశించింది.

- **శాఖల వలయం:** శతాబ్దం ముగిసేనాటికి, దేశవ్యాప్తంగా 40,000కు పైగా శాఖలు, లక్షలాది మంది క్రియాశీలక స్వయంసేవకులు, కోట్లాది మంది సానుభూతిపరులతో సంఘ్ ఒక అజేయమైన శక్తిగా మారింది.
- **అన్ని రాష్ట్రాలలో ఉనికి:** హిమాలయాలలోని లదఖ్ నుంచి హిందూ మహాసముద్ర తీరంలోని కన్యాకుమారి వరకు, ఈశాన్యంలోని అరుణాచల్ నుంచి పశ్చిమాన గుజరాత్ వరకు - భౌగోళికంగా, సాంస్కృతికంగా వైవిధ్యభరితమైన ప్రతి ప్రాంతంలోనూ 'భగవద్ధ్వజం' ఎగురుతోంది. ఇది సంఘ్ యొక్క 'అఖండ భారత్' భావనకు ఆచరణ రూపం.

**2. సామాజిక విస్తృతి – సర్వ స్పర్శి:**
ప్రారంభంలో పట్టణ ప్రాంతాలకు, కొన్ని కులాలకు పరిమితమైనదని విమర్శలు ఎదుర్కొన్న సంఘ్, 20వ శతాబ్దం చివరకు, సమాజంలోని ప్రతి వర్గాన్ని తనలో కలుపుకుంది.

- **గ్రామీణ విస్తరణ:** 'గ్రామ వికాస్' ద్వారా పల్లెల్లోకి చొచ్చుకుపోయింది.
- **వనవాసీ క్షేత్రం:** వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ద్వారా కోట్లాది మంది గిరిజనులకు చేరువైంది.
- **సామాజిక సమరసత:** దళితులు, వెనుకబడిన వర్గాలలో వేలాది మంది కార్యకర్తలను, నాయకులను తయారుచేసి, కుల అడ్డుగోడలను బద్దలు కొట్టింది. సంఘం నిజంగా ఒక 'సర్వ స్పర్శి, సర్వ వ్యాపి' (Alltouching, Allpervading) సంస్థగా మారింది.

**3. విశ్వవ్యాప్త ఉనికి:**
కేవలం భారతదేశమే కాదు, 1947లో కెన్యాలో ప్రారంభమైన ప్రవాస కార్యకలాపాలు, 2000 నాటికి అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, యూరప్, ఆసియాలోని 40కి పైగా దేశాలకు విస్తరించాయి. హిందూ స్వయంసేవక్ సంఘ్ (HSS) ద్వారా, విశ్వవ్యాప్త హిందూ సమాజాన్ని ఒకే తాటిపైకి తెచ్చింది.

సిద్ధాంత పరిణామం - 'హిందూ సంఘటన' నుంచి 'జాతీయ పునర్నిర్మాణం' వరకు
సంఘ్ సాధించిన అతిపెద్ద విజయం, భౌతిక విస్తరణ కంటే, దాని సైద్ధాంతిక పరిణామం మరియు స్వీకారం. ఒకప్పుడు "సంకుచితం", "మతతత్వం" అని ముద్ర వేయబడిన సంఘ్ సిద్ధాంతాలు, 20వ శతాబ్దం చివరి నాటికి "జాతీయవాదం", "దేశభక్తి"కి పర్యాయపదాలుగా మారాయి.

**1. 'సాంస్కృతిక జాతీయవాదం' – జాతీయ అజెండాగా:**
స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో, నెహ్రూవియన్ 'సెక్యులరిజం' మాత్రమే ఏకైక మార్గంగా కనిపించేది. 'హిందూ' అనే పదం ఉచ్చరించడమే తప్పుగా భావించే రోజులు అవి. కానీ, సంఘ్ తన నిరంతర తపస్సుతో, శ్రీ గురూజీ దార్శనికతతో, 'సాంస్కృతిక జాతీయవాదాన్ని' (Cultural Nationalism) జాతీయ చర్చలో కేంద్ర బిందువుగా (Mainstream Narrative) మార్చగలిగింది.

- **1990ల నాటికి,** "గర్వ్ సే కహో హమ్ హిందూ హై" (గర్వంగా చెప్పు మేము హిందువులమని) అనే నినాదం, కేవలం నినాదంగా కాకుండా, ఒక సామాజిక చైతన్యంగా మారింది.
- **భారతదేశ** జాతీయతకు ఆధారం ఇక్కడి సనాతన ధర్మమేనని, సుప్రీంకోర్టు సైతం "హిందుత్వం ఒక మతం కాదు, అదొక జీవన విధానం" అని తీర్పు చెప్పే స్థాయికి (1995 తీర్పు) దేశం ఎదిగింది. ఇది సంఘ్ సాధించిన గొప్ప బౌద్ధిక విజయం.

**2. 'సామాజిక సమరసత' – అంతర్గత సంస్కరణ:**
బాలాసాహెబ్ దేవరస్ గారి నాయకత్వంలో, సంఘ్ సాధించిన మరో విప్లవాత్మక ప్రగతి 'సామాజిక సమరసత'. అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా సంఘ్ చేసిన పోరాటం, హిందూ సమాజంలో ఒక నిశ్శబ్ద, నిర్మాణాత్మక మార్పును తీసుకువచ్చింది.

- **సహపంక్తి భోజనాలు,** దళితులకు ఆలయ ప్రవేశం వంటివి సంఘ్ కార్యకర్తల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. "కులాలను వదిలేయండి, హిందువులుగా ఏకం కండి" అనే సందేశం గ్రామగ్రామానికి చేరింది.

**3. 'ఏకాత్మ మానవతా వాదం' – స్వదేశీ ప్రత్యామ్నాయం:**
పాశ్చాత్య కమ్యూనిజం, క్యాపిటలిజంలకు ప్రత్యామ్నాయంగా, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అందించిన 'ఏకాత్మ మానవతా వాదం' (Integral Humanism), 20వ శతాబ్దం చివరకు ఒక బలమైన రాజకీయ, ఆర్థిక తత్త్వశాస్త్రంగా గుర్తింపు పొందింది. ఇది బీజేపీకి, స్వదేశీ జాగరణ్ మంచ్‌కు సైద్ధాంతిక పునాదిగా నిలిచింది.

**రాజకీయ పరివర్తన – అంటరానితనం నుంచి అధికార పీఠం వరకు**
20వ శతాబ్దంలో సంఘ్ సాధించిన అత్యంత ప్రస్ఫుటమైన, ప్రత్యక్షమైన విజయం రాజకీయ రంగంలో కనిపిస్తుంది. 1950లలో రాజకీయంగా 'అంటరాని' సంస్థగా, పూర్తిగా ఏకాకిగా ఉన్న స్థాయి నుంచి, 1990ల నాటికి దేశాన్ని శాసించే స్థాయికి ఎదగడం ఒక చారిత్రక పరిణామం.

**ప్రత్యామ్నాయం సృష్టి – జనసంఘ్ నుంచి బీజేపీ వరకు:**
కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యాన్ని బద్దలు కొట్టడానికి, సంఘ్ ఒక దీర్ఘకాలిక వ్యూహంతో పనిచేసింది. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జనసంఘ్ నుంచి, 1980లో ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీ (BJP) వరకు, సంఘ్ నిరంతరం నైతిక, కార్యకర్తల మద్దతును అందిస్తూ వచ్చింది.

- **ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం (1975-77):** ఈ పోరాటంలో సంఘ్ పోషించిన పాత్ర, దానికి రాజకీయంగా అపారమైన గౌరవాన్ని తెచ్చిపెట్టింది.
- **అయోధ్య ఉద్యమం (1990లు):** ఈ ఉద్యమం ద్వారా సంఘ్, బీజేపీలు దేశ రాజకీయ గతిని మార్చివేసాయి. 'ఓటు బ్యాంకు' రాజకీయాలకు వ్యతిరేకంగా 'జాతీయవాద' రాజకీయాలను ప్రత్యామ్నాయంగా నిలిపాయి.

**వాజ్‌పేయి శకం – స్వయంసేవక్ ప్రధానిగా:**
20వ శతాబ్దం ముగిసేనాటికి (1998, 1999), ఒక స్వయంసేవక్ అయిన శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి దేశ ప్రధానమంత్రిగా, మరో స్వయంసేవక్ శ్రీ లాల్ కృష్ణ అద్వానీ హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, సంఘ్ రాజకీయ ప్రస్థానంలో శిఖరాగ్ర విజయం.

- **ఇది సంఘ్** సిద్ధాంతాలకు లభించిన జాతీయ ఆమోదం.
- **"సంఘ్ భావజాలం** దేశాన్ని విడదీస్తుంది" అన్న విమర్శలకు, వాజ్‌పేయి గారి సమ్మిళిత పాలన (NDA) ఒక గట్టి సమాధానం చెప్పింది. సంఘ్ ప్రేరణతో వచ్చిన నాయకత్వం, దేశానికి సుస్థిరతను, అభివృద్ధిని ఇవ్వగలదని నిరూపించింది.

**నాలుగో భాగం:** సేవా సామ్రాజ్యం - మానవత్వానికి మారుపేరు
సంఘ్ అంటే కేవలం రాజకీయాలు, సిద్ధాంతాలు కాదు. 20వ శతాబ్దం చివరకు, సంఘ్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సేవా సంస్థగా (Largest Voluntary Service Organization) అవతరించింది. ఇది సంఘ్ సాధించిన అత్యంత సంతృప్తికరమైన ప్రగతి.

> **డాక్టర్ హెడ్గేవార్ నాటిన ఆ చిన్న విత్తనం, 20వ శతాబ్దం ముగిసేనాటికి, తన కొమ్మలతో, ఊడలతో యావత్ జాతిని రక్షించే, సేదతీర్చే, పోషించే ఒక మహావృక్షంగా ఎదిగింది. ఈ ప్రగతి, కేవలం సంఘ్ విజయం కాదు, ఇది భారతీయ ఆత్మ విజయం.**

**సేవా భారతి – లక్షన్నర సేవా ప్రాజెక్టులు:**
1989లో డాక్టర్ హెడ్గేవార్ శతజయంతి ఉత్సవాల నాటికి, "సేవయే పరమ ధర్మం" అనే నినాదంతో సంఘ్ సేవా కార్యక్రమాలను వేగవంతం చేసింది.

- **2000 నాటికి,** దేశవ్యాప్తంగా సేవా భారతి ఆధ్వర్యంలో లక్షకు పైగా సేవా ప్రాజెక్టులు (పాఠశాలలు, ఆసుపత్రులు, బాల సదనాలు, రక్తనిధి కేంద్రాలు) నడుస్తున్నాయి.
- **మురికివాడల** నుంచి మారుమూల గిరిజన గూడేల వరకు, సంఘ్ సేవా హస్తం అందని చోటు లేదు.

**విద్యా భారతి – విద్యా విప్లవం:**
దేశంలో ప్రభుత్వేతర రంగంలో (Non Governmental) అతిపెద్ద విద్యా వ్యవస్థను నడుపుతున్నది సంఘమే. 'విద్యా భారతి' ఆధ్వర్యంలో వేలాది సరస్వతి శిశు మందిరాలు, పాఠశాలలు నడుస్తున్నాయి. లక్షలాది మంది విద్యార్థులకు, ఆధునిక విద్యతో పాటు, భారతీయ సంస్కారం, దేశభక్తిని అందిస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతోంది.

**ఆపదలో ఆపద్బాంధవుడు:**
1977 దివిసీమ ఉప్పెన, 1984 భోపాల్ గ్యాస్ దుర్ఘటన, 1993 లాతూర్ భూకంపం, 1999 ఒడిశా సూపర్ సైక్లోన్... ఇలా 20వ శతాబ్దంలో దేశం ఏ విపత్తును ఎదుర్కొన్నా, అక్కడ అందరికంటే ముందుగా, ప్రభుత్వాన్ని మించి సేవ చేసింది సంఘ్ స్వయంసేవకులే. ఈ నిస్వార్థ సేవ, సంఘానికి సమాజంలో ఒక ప్రత్యేకమైన, గౌరవప్రదమైన స్థానాన్ని (Moral Authority) సంపాదించిపెట్టింది.

**ఐదో భాగం:** బహుముఖ విస్తరణ - సంఘ్ పరివార్ వృక్షం
సంఘ్ సాధించిన మరో గొప్ప విజయం, సమాజంలోని ప్రతి రంగాన్ని ప్రభావితం చేయగల అనుబంధ సంస్థలను (Affiliate Organizations) నిర్మించడం. దీనినే 'సంఘ్ పరివార్' అంటారు. 20వ శతాబ్దం ముగిసేనాటికి, ఈ పరివార్ ఒక మహాశక్తిగా మారింది.

1. **కార్మిక రంగం:** భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS), కమ్యూనిస్టు యూనియన్లను అధిగమించి, దేశంలోనే నంబర్ వన్ కార్మిక సంఘంగా అవతరించింది. "రాష్ట్ర హితమే కార్మిక హితం" అనే నూతన సిద్ధాంతాన్ని స్థాపించింది.
2. **విద్యార్థి రంగం:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP), దేశంలోని ప్రతి క్యాంపస్‌లో జాతీయవాద జెండాను ఎగురవేస్తూ, అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగింది.
3. **రైతు రంగం:** భారతీయ కిసాన్ సంఘ్ (BKS), రైతుల సమస్యలపై పోరాడుతూ, వారిని సంఘటితం చేసింది.
4. **ధార్మిక రంగం:** విశ్వ హిందూ పరిషత్ (VHP), రామజన్మభూమి ఉద్యమం ద్వారా సాధుసంతులను, హిందూ సమాజాన్ని ఏకం చేసి, ప్రపంచవ్యాప్తంగా హిందూ గొంతుకను వినిపించింది.
5. **ఆర్థిక రంగం:** స్వదేశీ జాగరణ్ మంచ్ (SJM), 1990ల ప్రపంచీకరణ దాడిని ఎదుర్కొని, 'స్వదేశీ' అనే ఆర్థిక జాతీయవాదాన్ని బలంగా వినిపించింది.
6. **వనవాసీ రంగం:** వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం, గిరిజనుల సంక్షేమానికి, మత మార్పిడుల నివారణకు అద్భుతమైన కృషి చేసింది.

ఇలా దాదాపు 30కి పైగా జాతీయ స్థాయి సంస్థల ద్వారా, సంఘ్ భారతీయ జీవనంలోని ప్రతి అణువునూ జాతీయవాద స్ఫూర్తితో నింపగలిగింది.

జాతీయ భద్రత, స్వాభిమానం - పోఖ్రాన్, కార్గిల్ విజయాలు
20వ శతాబ్దం చివరలో, 1998లో వాజ్‌పేయి ప్రభుత్వం జరిపిన పోఖ్రాన్ అణు పరీక్షలు, 1999లో కార్గిల్ యుద్ధ విజయం - ఈ రెండూ సంఘ్ యొక్క 'శక్తిసంపన్న భారత్' (Strong India) కల సాకారానికి నిదర్శనాలు.

- **సంఘ్ ఎప్పుడూ** "శాంతికి శక్తి అవసరం" (Peace through Strength) అని నమ్మింది. 1962 పరాజయం తర్వాత, దేశం సైనికంగా, అణుశక్తి పరంగా బలపడాలని సంఘ్ డిమాండ్ చేస్తూ వచ్చింది. 1998లో ఒక స్వయంసేవక్ ప్రధానిగా ఆ కలను నిజం చేశారు.
- **ఇది భారతదేశానికి** ప్రపంచ వేదికపై ఒక నూతన గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తెచ్చిపెట్టింది. శతాబ్దపు ఆత్మన్యూనతను (Inferiority Complex) పోగొట్టింది.

**21వ శతాబ్దానికి బలమైన పునాది**
20వ శతాబ్దం ముగిసేనాటికి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సాధించిన ప్రగతి ఒక అద్భుతమైన విజయగాథ.

- **అది మూడుసార్లు** నిషేధాలను (1948, 1975, 1992) ఎదుర్కొంది, కానీ ప్రతిసారీ మరింత బలంగా, స్వచ్ఛంగా బయటకు వచ్చింది.
- **అది విమర్శలను,** అవహేళనలను, దాడులను తట్టుకుని నిలబడింది.
- **అది శూన్యం** నుంచి ప్రారంభమై, ఈనాడు భారత దేశాన్ని నడిపించే సైద్ధాంతిక శక్తిగా ఎదిగింది.

ఈ ప్రగతికి కారణం - దాని మౌలిక సిద్ధాంతంలోని సత్యం, దాని కార్యపద్ధతి (శాఖ)లోని బలం, మరియు లక్షలాది మంది అజ్ఞాత, నిస్వార్థ కార్యకర్తల (ప్రచారకుల) త్యాగం.
2000 సంవత్సరం నాటికి, సంఘ్ భారతీయ సమాజంలో ఒక అనివార్యమైన శక్తిగా మారింది. అది కేవలం ఒక సంస్థ కాదు, అదొక జీవన విధానం, అదొక జాతీయ సంస్కారం. 20వ శతాబ్దంలో సంఘ్ వేసిన ఈ పటిష్టమైన పునాదులే, 21వ శతాబ్దంలో భారతదేశం 'విశ్వగురు'గా ఎదగడానికి, 'ఆత్మనిర్భర భారత్'గా మారడానికి కావలసిన శక్తిని, స్ఫూర్తిని, మానవ వనరులను అందిస్తున్నాయి.

రచన: భూక్యా గోపినాయక్

# ఓట్లేస్తేనే.. నిధులిస్తా...

మొదటిపేజీ తరువాయి...
ఓటర్లు తమ అభ్యర్థులను తిరస్కరిస్తే నిధులను నిలిపివేస్తానని పవార్ వెల్లడించడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధమని ఆరోపిస్తున్నాయి. "నిధులు అంటే అజిత్ పవార్ ఇంటి నుంచి వచ్చే సొమ్ము కాదు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి వచ్చే డబ్బు. ఓటర్లను బెదిరించడం సరైంది కాదు. ఇవన్నీ చూస్తూ ఎన్నికల సంఘం ఎందుకు నిశ్శబ్దంగా ఉంది?" అని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్ ధన్వే ప్రశ్నించారు. ప్రతిపక్షాల ఆరోపణలపై అజిత్ పవార్ శిబిరం మాత్రం ఇంకా అధికారికంగా స్పందించలేదు. కాగా, ఎన్నికల వేళ ఉపముఖ్యమంత్రిగా, ముఖ్యంగా ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవం

మొదటిపేజీ తరువాయి...
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్తో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు.

# రాంలీలా నుంచి ఓట్ చోరీపై సమరం

మొదటిపేజీ తరువాయి...
"భారత ప్రజాస్వామ్యాన్ని ఓటు దొంగల పంజా నుంచి విడిపించేందుకు ఇదే ప్రారంభం" అని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. ర్యాలీ డిసెంబర్ 14న మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. "ప్రస్తుతానికి ప్రజాస్వామ్యాన్ని కమ్మేస్తున్న అతిపెద్ద ప్రమాదం ఓట్ చోరీ. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా రామ్‌లీలా మైదానం నుంచే బలమైన సందేశాన్ని ఇవ్వబోతున్నాం" అని పార్టీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ప్రస్తుతం వివక్షతో, పాక్షికతతో పనిచేస్తోందని, అలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ నిశ్శబ్దంగా ఉండలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎన్నికల అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలోనే ఓట్ల దోపిడీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. బిహార్ ఫలితాలు కూడా ఈ "ఓట్ చోరీ" ఫలితమేనని, దీనికి ప్రధాని, హోం మంత్రి, ఎన్నికల కమిషన్ కలిసి వ్యూహం పన్నారని పార్టీ ఆరోపించింది. ఓట్ చోరీ అంశంపై రాహుల్ గాంధీ ఆగస్టులో నిర్వహించిన మీడియా సమావేశం తర్వాత సెప్టెంబర్ నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సంతకాల ఉద్యమం ప్రారంభించింది. ఈ క్రమంలో కర్ణాటక కాంగ్రెస్ 1.12 కోట్ల సంతకాలు, పంజాబ్ కాంగ్రెస్ 27 లక్షల సంతకాలను సేకరించి పార్టీ కేంద్ర నాయకత్వానికి అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగిందని పార్టీ తెలిపింది. బోగస్ ఓట్ల చేర్పులు, విపక్ష అనుకూల ఓటర్ల తొలగింపులు, ఎన్నికల జాబితాల్లో భారీ అవకతవకలు—ఇవన్నీ బీజేపీ-ఈసీఐ సంయుక్త పన్నాగాలేనని కేసీ వేణుగోపాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఎంసీసీ ఉల్లంఘనలను ఈసీఐ పట్టించుకోవడం లేదు. బీజేపీ డబ్బులు పంచుతూ బహిరంగంగా రిగ్గింగ్ చేస్తుంటే ఎలా సహకరిస్తుందో దేశ ప్రజలందరికీ తెలుసు" అని ఆయన మండిపడ్డారు.

# రేవంత్ సర్కారు ల్యాండ్ లూటింగ్ పాలసీ

మొదటిపేజీ తరువాయి....
కేటీఆర్ చేసిన ఆరోపణలు నిజమేనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని శ్రీధర్ బాబును సవాల్ చేశారు. రెండు బడ్జెట్లతో సమానమైన ఇంతటి నిర్ణయాన్ని అసెంబ్లీలో చర్చ పెట్టకుండా రాత్రికి రాత్రే చేస్తం అంటే ఎందుకు ఊరుకుంటామన్నారు. ఇంత పెద్ద స్కామ్‌కు కుట్ర చేస్తున్నా... బిజేపీ ఎందుకు మౌనంగా ఉంది. కాంగ్రెస్‌తో కుమ్మక్కు కాకుంటే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డిని.. ఎనిమిది ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. అసెంబ్లీ పెట్టి వెంటనే చర్చకు పెట్టాలన్నారు. నిన్న కేటీఆర్ వేసిన ప్రశ్నలకు, ఇపుడు తాను వేసిన 8 ప్రశ్నలకు నిజాయితీ ఉంటే సమాధానం చెప్పాలన్నారు. తిట్టినా, కేసులు పెట్టినా నిన్ను వదలం రేవంత్ రెడ్డి. ప్రజల హక్కులు, ఆస్తులు కాపాడటమే ప్రతిపక్షం బాధ్యత. నిలదీస్తూనే ఉంటం. ప్రజా క్షేత్రంలో నీ తప్పులను ఎండగడుతూనే ఉంటం అని హరీశ్ రావు పేర్కొన్నారు.

# దమ్ముంటే ఆధారాలతో నిరూపించు లేదంటే క్షమాపణ చెప్పు

మొదటిపేజీ తరువాయి...
'మీరు అధికారం కోల్పోయారనే బాధతో రూ. 5 లక్షల కోట్ల స్కాం అంటూ పాత రికార్డును పదే పదే వాయించే బదులు... మీరు ఆగస్టు 2023లో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న 'రూ. లక్షల కోట్ల మతలబు' గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మంత్రిగా సుదీర్ఘ అనుభవమున్న హరీష్ రావు తమ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తుంటే... స్కాంలు చేసి చేసి అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఇది మింగుడు పడటం లేదన్నారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్‌కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 శాతం, 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటంటూ ప్రశ్నించారు.



# సుమో రింగ్‌లోకి సనై తకాయిచి..?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికైన సనై తకాయిచి ప్రస్తుతం సుమో రింగ్‌లోకి అడుగుపెడతారా లేదా అనే ప్రశ్న అంతర్జాతీయంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. జపాన్‌లో మహిళలు సుమో రింగ్‌లోకి ప్రవేశించడంపై నిషేధం చాలా కాలంగా కొనసాగుతోంది. సనై తకాయిచి ఈ నిషేధాన్ని తొలిసారిగా ఉల్లంఘించే అవకాశం ఉందా అన్నదానిపై చర్చ మొదలైంది.**

క్యుషు గ్రాండ్ సుమో టోర్నమెంట్ ఆదివారం ముగియనున్న నేపథ్యంలో, విజేతకు ప్రధాని కప్ అందించడం పరంపరగా ఉంది. గత ప్రధానులు రింగ్‌లోకి ప్రవేశించి విజేతను సత్కరించేవారు. మరి తకాయిచి కూడా అదే సంప్రదాయాన్ని అనుసరించాలా? లేదా మహిళల ప్రవేశ నిషేధాన్ని పాటిస్తూ రింగ్‌లోకి దూరంలోనే ఉండాలా? అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. జపాన్ సంప్రదాయాలు, పితృస్వామ్య వ్యవస్థకు మద్దతుగా వ్యవహరించే తకాయిచి ఈ నిషేధాన్ని ఉల్లంఘించే అవకాశాలు తక్కువేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న జీ-20 సదస్సుకు హాజరవుతున్నందున టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరుకాకపోవచ్చనేది మరో సమాచారం. టోక్యోలో నూతన సంవత్సరం సందర్భంగా జరిగే పోటీలలో ఈ వివాదంపై ఆమె ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని పలువురు భావిస్తున్నారు. జపాన్‌లో సుమో రింగ్ మాత్రమే కాదు, పలు పవిత్ర ప్రదేశాలు, మతపరమైన శిక్షణా కేంద్రాలు, ఆలయాలలో కూడా మహిళలకు ప్రవేశం నిషేధితమే. కొన్ని పండగలలో స్త్రీలు పాల్గొనకూడదనే పరిమితులు ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. రుతుస్రావం, ప్రసవం వంటి శారీరక అంశాలతో పాటు బుద్ధిజంలోని మహిళా వ్యతిరేక ఆలోచనలు ఈ నిషేధాలకు కారణమని ఐచి గాకుయిన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నవోకో కొబయాషి వివరిస్తున్నారు. సమాజంలో మహిళలు ఉన్నతస్థాయి పదవులు చేపట్టినా, ఇలాంటి సంప్రదాయ నిషేధాల్లో మార్పు రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మౌంట్ ఫుజి సహా కొన్ని మతపరమైన ప్రదేశాల్లో ప్రవేశ నిషేధాన్ని కాలక్రమంలో తొలగించినప్పటికీ, ఇంకా అనేక చోట్ల ఈ నిబంధనలు కొనసాగుతూనే ఉన్నాయి. సుమో మతపరమైన షింటో సంప్రదాయాలతో గాఢ సంబంధం కలిగి ఉందని చెప్పబడుతున్నా, మహిళల ప్రవేశ నిషేధం షింటో విశ్వాసాల కారణమనే వాదనను జపాన్ సుమో అసోసియేషన్ ఖండిస్తోంది. అయితే మహిళల హక్కుల పరంగా జపాన్ ఇంకా వెనుకబడిన దేశంగానే పరిగణించబడుతోంది. ప్రపంచ సమానత్వ ర్యాంకింగ్స్‌లో జపాన్ స్థానము 100కు పైగా ఉండటం దీనికి నిదర్శనం. ఇలాంటి నేపథ్యంలో జపాన్ దేశ పగ్గాలు చేపట్టిన సనై తకాయిచి ఈ సుమో వివాదంలో ఏ దిశగా నిర్ణయం తీసుకుంటారనే దానిపై అందరి దృష్టి మళ్లింది.



# చైనాలో పెరిగిన పెళ్లిళ్ల సంఖ్య..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**చైనాలో తగ్గిపోతున్న జనాభా రేటుతో తీవ్ర ఆందోళనకు గురైన ప్రభుత్వానికి కొంతకాలం తర్వాత ఊరటనిచ్చే సమాచారం లభించింది. ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాల్లో దేశంలో 5.2 మిలియన్ (52 లక్షలు) వివాహాలు జరిగాయని అధికార గణాంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 4 లక్షల అధికం కావడం ప్రత్యేకత.**

నిబంధనల సడలింపే మార్పుకు కారణం అని నిపుణులు అంటున్నారు. గతంలో తమ స్వస్థలంలోనే పెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చిన యువతకు, ఇప్పుడు దేశంలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించడంతో పెద్దఎత్తున వివాహాలు నమోదవుతున్నాయి. ఉపాధి కోసం దూరప్రాంతాల్లో ఉంటున్న వారికీ ఇది అనుకూలంగా మారింది. రిజిస్ట్రేషన్ వ్యవస్థ సులభతరం కావడంతో పెళ్లిళ్ల సంఖ్య వెంటనే పెరిగినట్లు విశ్లేషకుల అభిప్రాయం. అయితే పెళ్లి, పిల్లలు అనే అంశాలపై చైనా యువత దృక్పథం మాత్రం పెద్దగా మారలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం పరిపాలనా అడ్డంకులు తొలగించడంతో వచ్చిన పెరుగుదల తప్ప, వారి వ్యక్తిగత నిర్ణయాలలో పెద్ద మార్పు కనిపించడం లేదని స్పష్టం చేస్తున్నారు. సంప్రదాయ కుటుంబ వ్యవస్థపై యువత ఆసక్తి తగ్గడం ఇప్పటికీ పెద్ద సమస్యగానే కొనసాగుతుందని వెల్లడించారు. చైనాలో ప్రస్తుతం మహిళల సంతానోత్పత్తి రేటు 1 కన్నా తక్కువగా ఉంది. జనాభా స్థిరంగా ఉండాలంటే 2.1 రేటు అవసరం. ఈ ధోరణి కొనసాగితే 2100 నాటికి ప్రస్తుత 1.4 బిలియన్ జనాభా, 653 మిలియన్‌లకు పడిపోతుందని హెచ్చరికలు వెలువడుతున్నాయి. జనాభాలో వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల పబ్లిక్ హెల్త్ సిస్టమ్, ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడే ప్రమాదం ఉంది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతి కూడా దెబ్బతినే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. అందువల్లే ప్రభుత్వం యువతను వివాహాల వైపు, తర్వాత పిల్లల జననంపై ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపడుతోంది. మహిళలకు ఆర్థిక ప్రయోజనాలు, పిల్లల పెంపకానికి సహాయ పథకాలు, హౌసింగ్ సబ్సిడీలు వంటి ప్రయోజనాలు అందిస్తూ కుటుంబ ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తుంది. పెళ్లిళ్ల పెరుగుదల తాత్కాలిక ఆనందం తీసుకువచ్చినా, జనాభా సంక్షోభాన్ని దీర్ఘకాలంలో పరిష్కరించాలంటే ఇంకా సుదీర్ఘ మార్గం మిగిలే ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# జీ-20 లో ఐక్యత లేదన్న మేక్రాన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**దక్షిణాఫ్రికా జోహనస్‌బర్గ్ లో జరుగుతోన్న జీ–20 సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మేక్రాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సంక్షోభాలను పరిష్కరించడంలో జీ–20 కూటమి ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో దాని ఉనికే ప్రమాదంలో పడుతోందని ఆయన స్పష్టం చేశారు.**



సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కాకపోవడాన్ని ప్రస్తావించిన మేక్రాన్, ప్రపంచంలోని ప్రధాన సంక్షోభాలను ఎదుర్కోవడంలో ఐక్యత లోపిస్తే ఈ కూటమి ప్రభావం తగ్గిపోతుందని ఇమాన్యుయల్ మేక్రాన్ హెచ్చరించారు. ఉక్రెయిన్ సంక్షోభంపై మాట్లాడుతూ, ప్రజల సార్వభౌమత్వాన్ని గౌరవించకపోతే ఉక్రెయిన్ లో శాంతి సాధ్యం కాదని మేక్రాన్ పేర్కొన్నారు. మానవతా చట్టం, ప్రాదేశిక సమగ్రత వంటి అంశాలపై ఏకాభిప్రాయాన్ని ఏర్పరచేందుకు జీ-20 కృషి చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రాధాన్య విభాగాల్లో సభ్య దేశాలు సమష్టిగా ముందుకు రాకపోతే కూటమి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇటువంటి హెచ్చరికలు ఆయన గతంలోనూ చేశారు. రష్యా, ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి ముందు 'నాటో బ్రెయిన్ డెడ్ అయింది' అని మేక్రాన్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద సంచలనం రేగిన సంగతి తెలిసిందే . దక్షిణాఫ్రికాలో ప్రారంభమైన జీ-20 సదస్సు ఓ ఉమ్మడి ప్రకటనను ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా హెచ్చరించినప్పటికీ, సభ్యదేశాలు ముందుకే సాగాయి. సాధారణంగా సదస్సు చివర్లో ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలుపుతుండగా, ఈసారి మాత్రం ప్రారంభ సమావేశంలోనే తీర్మానానికి అమోద ముద్రపడింది. ఈ జీ-20లో ఐక్యతను ప్రదర్శించినప్పటికీ, అమెరికా అభిప్రాయం దాదాపు పక్కన పెట్టినట్లయింది. సదస్సులో పాల్గొనడంపై అమెరికా తీసుకుంటున్న వైఖరి గురించి స్పందించిన దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వ్యవహారాలశాఖ మంత్రి రొనాల్డ్ లమోలా, అమెరికా హాజరైనా హాజరుకాకపోయినా జీ-20 తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. సభ్యదేశాలు గ్లోబల్ సమస్యలను ఎదుర్కోవడంలో సహకారం కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల వేదికగా ఉన్న జీ-20 భవిష్యత్తుపై మేక్రాన్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారాయి. ఐక్యత, సహకారం అవసరాన్ని ఈ సదస్సు మళ్లీ స్పష్టంగా ప్రస్తావించింది.

# నోబెల్ అవార్డు గ్రహీతకు అడ్డంకులు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని అందుకునేందుకు చిక్కులు ఎదురవుతున్నాయి . వెనెజులా విపక్ష నేత మరియా కొరీనా మచాడో ను ప్రకటించిన సంగతి తెలిసిందే.**

డిసెంబర్ 10న నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పురస్కారాల ప్రదానోత్సవం జరగనున్న నేపథ్యంలో ఈ అవార్డును అందుకునేందుకు మరియా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని వెనెజులా అటార్నీ జనరల్ ఓ ప్రకటనలో తెలిపింది. . కుట్రలు, విద్వేషాన్ని ప్రేరేపించడం, ఉగ్రవాదం వంటి ఆరోపణలు, పలు కేసులు ఉండడంతో మరియాపై ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వెనెజులా నాయకురాలు మరియా కొరీనాపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అటార్నీ జనరల్ తన నివేదికలో వెల్లడించారు. కరేబియన్ సహా చుట్టుపక్కల సముద్రాలపై అమెరికా సైనిక దళాల మోహరింపుకు ఆమె మద్దతు ఇచ్చినందునే ఈ దర్యాప్తు జరుగుతోందని అన్నారు. దేశం దాటి వెళ్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించిన నేపథ్యంలో, వచ్చే నెల నోబెల్ శాంతి పురస్కారం పొందేందుకు మరియా వెళ్లకపోవచ్చని సమాచారం. వెనెజులా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాకు విపరీతంగా చేరుతున్నాయని ట్రంప్ ఆరోపణలు చేస్తున్నారు. ఈ ముఠాలతో అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం తీవ్రంగా విమర్శించింది. ఈ నేపథ్యంలో ఆ ముఠాలను అణచివేయడానికి అమెరికా సైన్యాన్ని రంగంలోకి దింపింది. అగ్రరాజ్యం చేపట్టిన ఈ చర్యలకు మరియా మద్దతు ఇవ్వడాన్ని వెనెజులా ప్రభుత్వం విమర్శిస్తోంది. వెనెజులా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడినందుకు మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించినట్లు నార్వే కమిటీ తెలిపింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్య సాధన కోసం ఆమె చేసిన కృషిని ప్రశంసించింది. ఈ పోరాటంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నదని, ఏడాదిగా అజ్ఞాత జీవితం గడుపుతున్నదని కమిటీ పేర్కొంది. నోబెల్‌కు ఎంపికైనందుకు మరియా సోషల్ మీడియాలో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఈ పురస్కారాన్ని వెనెజులా ప్రజలు మరియు తమ పోరాటానికి మద్దతిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

# కూలిన విమానం.. పాక్ జర్నలిస్టు నవ్వులు..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


**దుబాయ్ ఎయిర్ షోలో ఓ పాక్ జర్నలిస్టు తన మనసులోని కుళ్లంతా వెళ్లగక్కాడు. తేజస్ జెట్ కూలడం చూసి సంబర పడుతూ వీడియో రికార్డు చేశాడు. ఇది ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.**



జనాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కూలిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేకెత్తించింది. ఈ ఘటనలో వింగ్ కమాండర్ నమాన్ష్ కూడా మృతి చెందారు. ఈ ఘటనపై అనేకమంది విచారం వ్యక్తం చేశారు. అయితే, ఓ పాక్ జర్నలిస్టు మాత్రం ఈ ఘటన చూసి తెగ సంబరపడిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం తెగ వైరల్‌గా మారింది. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, తేజస్ జెట్ కూలిన వెంటనే ఒక్కసారిగా నల్లటి పొగ వ్యాపించింది. అది చూసిన పాక్ జర్నలిస్టు ఒకరు తెగ సంబరపడ్డాడు. ఆ దృశ్యాన్ని ఫోన్‌లో రికార్డు చేస్తూ జెట్ విమానం కూలిన వైపునకు పరుగులు తీశాడు. నోటికొచ్చినట్టు వాగుతూ అణుచుకోలేని సంబరంతో ఊగిపోయాడు. ఇదో బ్రేకింగ్ న్యూస్ అంటూ తన చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. ఇది మనమీద పడలేదు కాబట్టి బతికిపోయామని అక్కడే ఉన్న మరో వ్యక్తి అన్నాడు. ఆ తరువాత వారిద్దరూ కలిసి పొట్టచెక్కలయ్యేలా నవ్వుకున్నారు. అయితే, ఇవన్నీ అసత్యాలని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ స్పష్టం చేసింది. ఇక ఈ వీడియో వైరల్ కావడంతో జనాలు ఆ పాక్ జర్నలిస్టును ప్రతిఒక్కరూ తిట్టుకుంటున్నారు. జర్నలిజం విలువలు కూడా మర్చిపోయి మనసులోని విషాన్ని బయటపెట్టుకున్నాడని అన్నారు. ఒక వ్యక్తి చనిపోయిన సందర్భంలో ఇంతలా సంబరపడటం ఏమిటని, ఇది చాలా దారుణమని, అమానవీయమని విమర్శించారు. అవతలివారితో ఎంతటి శత్రుత్వం ఉన్నా నైతికత, కనీస మర్యాదను కోల్పోకూడదని కామెంట్ చేశారు. పాక్ అగ్రనేతలు కూడా ఇటీవల పలుమార్లు ఉన్మాదంతో రెచ్చిపోయి భారత్‌పై నోరుపారేసుకున్న విషయం తెలిసిందే. తమ వద్ద కూడా అణు బాంబులు ఉన్నాయంటూ భారత్‌పై రెచ్చిపోయారు.


# రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా వ్యూహం?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



**అమెరికా, రష్యా శాంతి ప్రణాళిక డ్రాఫ్ట్ లీకైంది. ఉక్రెయిన్ నియంత్రణలో ఉన్న తూర్పు ఉక్రెయిన్‌లోని పారిశ్రామిక ప్రాంతమైన డాన్‌బాస్‌లోని కొన్ని ప్రాంతాల నియంత్రణను రష్యాకు అప్పగించాల్సి ఉంటుందని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అలా అయితే ఉక్రెయిన్ భూభాగం తగ్గడం ఖాయం.**

తాజా ప్రణాళికల ప్రకారం, ఉక్రెయిన్ తన సైనికుల సంఖ్యను 6 లక్షలకు తగ్గించుకోవాలి, ఇది తప్పనిసరి. మరి ప్రణాళికలోని మిగిలిన విషయాల సంగతేంటి? దాని నుంచి ఎక్కువ లబ్ధి పొందుతోంది ఎవరు? ముఖ్యమైన అంశాలేమిటి? ఈ ప్రణాళికలో 28 ప్రధాన అంశాలు ఉన్నాయి. వాటిలో చాలావరకు ఉక్రెయిన్‌కు అంగీకార యోగ్యంగా ఉండొచ్చు. మిగిలిన వాటి విషయంలో అస్పష్టత ఉంది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ధ్రువీకరిస్తారు. ఉక్రెయిన్‌కు పటిష్ట భద్రతా హామీలతో పాటు రష్యా, ఉక్రెయిన్, యూరప్ మధ్య "సమగ్రమైన దురాక్రమణ రహిత ఒప్పందం" చేసుకోవాలి. అలాగే, వంద రోజుల్లో ఉక్రెయిన్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. ఒకవేళ ఉక్రెయిన్‌పై రష్యా మళ్లీ దాడికి దిగితే, "సమన్వయంతో బలమైన సైనిక ప్రతిస్పందన"తో పాటు రష్యాపై ఆంక్షలు విధించడం, ఒప్పందం రద్దు చేసుకుని మళ్లీ తిరిగి యుద్ధం ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో మార్షల్ లా అమల్లో ఉండడంతో ఎన్నికలు జరపడం సాధ్యం కాకపోయినప్పటికీ, శాంతి ఒప్పందం కుదిరితే ఎన్నికలు జరిగే అవకాశం లేకపోలేదు. అయితే, ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు ఎవరిస్తారు? అవి ఎంత పటిష్టంగా ఉంటాయి? అనే దానిపై సమగ్ర వివరాలు లేవు. ఉక్రెయిన్‌పై దాడి చేస్తే అందరిపైన దాడిచేసినట్టేనన్న నాటో తరహా ఆర్టికల్ 5తో పోలిస్తే ఇది బలహీనంగా ఉంది. ఒప్పందంపై సంతకం చేయాలంటే హామీలు మరింత స్పష్టంగా ఉండాలని ఉక్రెయిన్ కోరవచ్చు. దీంతో వీరిద్దరి మధ్య సయోధ్య కుదురుస్తున్న అమెరికాకు ఎటూతేలని శాంతి ఒప్పందం అవుతుంది.



# డబుల్ హనీ-మూన్ ధమాకా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పెళ్లి సందడి ముగిసిన వెంటనే కొత్త దంపతులు ప్రణాళిక హనీమూన్ ఇప్పుడు ఆసక్తికరమైన మార్పులకు వేదికవుతోంది. వారాల తరబడి జరిగిన వివాహం హడావుడి తర్వాత సేద తీరడానికి వెళ్లే హనీమూన్‌కు ఆధునిక జంటలు కొత్త రూపును ఇస్తున్నాయని ప్రముఖ ఇండియన్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ 'థ్రిలోఫిలియా' తన 'హనీమూన్ ట్రావెల్ రిపోర్ట్ 2025-26'లో వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఒకటి కాదు రెండు హనీమూన్‌లను ప్లాన్ చేసుకోవడం కొత్త ట్రెండ్‌గా మారింది. పెళ్లి అయిన వెంటనే జరిపే 'మినీమూన్', కొన్ని నెలల తర్వాత పక్కా ప్రణాళికతో వెళ్లే 'బిగ్‌మూన్' అనే రెండు విభిన్న ప్రయాణాలు ఇప్పుడు దంపతుల ఎంపికగా మారాయి. దేశీయ హనీమూన్ గమ్యస్థానాల్లో కేరళ, అండమాన్, గోవా, రాజస్థాన్ ప్రముఖంగా నిలుస్తున్నాయి. సహజ సౌందర్యం, సంస్కృతి, ప్రశాంతత కలిసి ఉన్న ఈ ప్రదేశాలు మినీమూన్, బిగ్‌మూన్ రెండింటికీ సరైనవి. ఏకాంతాన్ని కోరుకునే జంటలు హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, కూర్గ్ వంటి ఆఫ్‌బీట్ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. అంతర్జాతీయంగా థాయ్‌లాండ్, వియత్నాం, బాలి, మాల్దీవులు అత్యంత ఆకర్షణీయ గమ్యాల్లో ఉన్నాయి. థ్రిలోఫిలియా నివేదిక ప్రకారం, 'మినీమూన్' అంటే పెళ్లైన వెంటనే 3 నుంచి 5 రోజుల పాటు దగ్గరలోని ప్రశాంత ప్రదేశానికి వెళ్లి విశ్రాంతి తీసుకోవడం. ఈ ట్రెండ్ ఏటా 18 శాతం చొప్పున పెరుగుతోందని నివేదిక పేర్కొంది. వివాహం అలసట నుంచి బయటపడేందుకు చిన్న విరామం కావాలనుకోవడం, ఈ కోసం ఎక్కువ సెలవులు అవసరం లేకపోవడం, ప్రయాణ ఏర్పాట్లు కూడా సులభంగా ఉండటం మినీమూన్ ప్రాచుర్యానికి ప్రధాన కారణాలుగా గుర్తించారు. వివాహ బంధంలో తొలి సంవత్సరం ఎలా జరుపుకోవాలనే విషయంలో యువత ఆలోచనలు మారుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెళ్లి అయిన కొన్ని నెలల తర్వాత ఇద్దరూ కలిసి ఎక్కువ కాలం ఉండేలా ఓ పక్కా ప్రణాళికతో చేసే ప్రయాణాన్ని 'బిగ్‌మూన్' అంటారు. ఈ సమయంలో దంపతులు తమ అభిరుచులు, బడ్జెట్, ఆసక్తులను ఆధారంగా చేసుకుని దేశంలోనో విదేశాల్లోనో ఓ ప్రయాణ గమ్యస్థానాన్ని ఎంపిక చేసుకుంటారు. ఈ ప్రయాణం కేవలం విశ్రాంతికే కాకుండా, మరింత లోతైన అనుభూతిని, పరస్పర అవగాహనను పెంపొందించే అవకాశం ఇస్తుందని నివేదిక వివరించింది. హనీమూన్‌లలో అనుభవాలకే పెద్దపీట వేస్తున్నారని థ్రిలోఫిలియా సర్వే తేల్చింది. సుమారు 64 శాతం జంటలు విలాసవంతమైన బస కన్నా సన్‌సెట్ క్రూజ్‌లు, ప్రైవేట్ విల్లాలు, బీచ్ డిన్నర్లు వంటి రొమాంటిక్ అనుభవాలను కోరుకుంటున్నారని వెల్లడించింది. అలాగే 42 శాతం జంటలు తమ ప్రయాణంలో స్నార్కెలింగ్, జిప్‌లైనింగ్, మంచుతో ఆడుకోవడం, ఎడారిలో నక్షత్రాలను వీక్షించడం వంటి సాహస యాత్రలతో పాటు ఆయుర్వేద రిట్రీట్స్ వంటి వెల్‌నెస్ అనుభవాలను తమ ప్లాన్ లో భాగంగా ఉండేలా చేర్చుకుంటున్నారు. ఆధునిక నవ దంపతులు తమ వైవాహిక జీవితాన్ని ఒక చిన్న విశ్రాంతితో ప్రారంభించి, తర్వాత ఒక పెద్ద అనుభవాత్మక ప్రయాణంతో మరింత మధురంగా మార్చుకోవడాన్ని ఇష్టపడుతున్నారని థ్రిలోఫిలియా నివేదిక స్పష్టం చేస్తోంది.

# బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

ఈ కేసు విచారణ సమయంలో బోల్సొనారో గృహనిర్బంధంలో ఉన్నారు. కోర్టు విధించిన శిక్షపై అప్పీలుకు వెళ్లగా అక్కడ చుక్కెదురయ్యింది. జైలుకెళ్తే తీవ్ర ఇబ్బందులు ఉంటాయని, ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని మాజీ అధ్యక్షుడి తరపు న్యాయవాదులు వాదించారు. మరోవైపు ఆయన ఆరోగ్యం క్షీణించిందని, గృహనిర్బంధంలోనే ఉంచాలని ఆయన తరపున కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఎలాంటి ఉపశమనం లభించకపోవడంతో బోల్సొనారో ను పోలీసులు అదుపులోకి తీసకుని జైలుకు తరలించారు. 2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

# డ్రగ్స్-టెర్రర్ పై ఉమ్మడి పోరు

మొదటిపేజీ తరువాయి....

ఆఫ్రికా ఖండం తొలిసారిగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో మొదటి సెషన్ లో మోదీ ప్రసగించారు. అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ అభివృద్ధి దిశగా నాలుగు వినూత్న ప్రతిపాదనలు ప్రపంచ దేశాల ముందుంచారు. మొదటి ప్రతిపాదనగా, జీ20 ఆధ్వర్యంలో 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ'ను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యావరణ అనుకూలమైన సాంప్రదాయ జీవన విధానాలు, సాంస్కృతిక విజ్ఞానం, పాత తరం నుండి వచ్చిన పరిజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రయత్నానికి భారతీయ విజ్ఞాన వ్యవస్థ ఒక బలమైన ఆధారంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఆఫ్రికా అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో 'జీ20-ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్'ను ప్రకటించారు. రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 10 లక్షల సర్టిఫైడ్ శిక్షకులను తీర్చిదిద్దడం ద్వారా అక్కడి యువతకు భారీ అవకాశాలు అందుతాయని తెలిపారు. ప్రపంచ పురోగతిలో ఆఫ్రికా పాత్ర అత్యంత ముఖ్యమని రెండో ప్రతిపాదనగా ఆయన సూచించారు. మూడో ప్రతిపాదనగా, డ్రగ్స్‌టెర్రర్ పరస్పర సంబంధాలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టారు. ఫెంటానిల్ వంటి ప్రమాదకర సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి, అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని జీ20 దేశాలు సమన్వయంతో పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఆరోగ్య అత్యవసరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించేందుకు 'జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్' ఏర్పాటు అవసరాన్ని నాలుగో ప్రతిపాదనగా మోదీ ప్రస్తావించారు. ఈ బృందం ద్వారా ప్రపంచ ఆరోగ్య భద్రత మరింత బలపడుతుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
ఆదివారం | హైదరాబాద్
23.11.2025
www.manasarkar.com





## పరకామణి చోరీ కేసులో జర్నలిస్టుకు భద్రత

**తిరుమల (ఏడీఎన్ఎన్) :**

**తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసులో పిటిషన్ వేసిన జర్నలిస్టు శ్రీనివాసులకు భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది.జర్నలిస్టు శ్రీనివాసులు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, కేసు సంబంధంగా తనకు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కోసం పోలీసుల్ని సంప్రదించినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదని పేర్కొన్నారు.**

నవంబర్ 15న సమర్పించిన వినతిపత్రంపై చర్యలు తీసుకోకపోవడంతో, కోర్టు శరణు పొందినట్లు తెలిపారు. విచారణ తర్వాత ధర్మాసనం, తిరుపతి జిల్లా ఎస్పీకి పిటిషనర్‌కు తక్షణ భద్రత కల్పించాలని ఆదేశించింది. అంతేకాదు, ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు జర్నలిస్టుకు నిర్బంధ రక్షణ ఉండాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కోర్టు, పరకామణి కేసులో నిందితుడు , సాక్షులకు భద్రత కల్పించాలని సీఐడీ డీజీ, రాష్ట్ర డీజీపీకి ఇప్పటికే పంపిన అధికారిక లేఖను మరోసారి గుర్తుచేసింది. దర్యాప్తులో కీలకమైన పాత్ర పోషించే సాక్షులు, సంబంధిత వ్యక్తులు సంరక్షణలో ఉండాలని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇటీవల ఇదే కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిందితుడు సీవీ రవికుమార్, అలాగే సాక్షులకు కూడా భద్రత కల్పించాలంటూ హైకోర్టు సీఐడీ డీజీకి ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారుడు సతీష్ కుమార్ అనూహ్యరీతిలో మరణించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. దర్యాప్తు అధికారి ముందు హాజరు కావడానికి వెళ్తున్న సమయంలో జరిగిన ఈ సంఘటనను కోర్టు సీరియస్‌గా తీసుకుంది. కోర్టు ఇప్పటికే నిందితులు, సాక్షులు సహా కేసుకు సంబంధించిన ప్రతి ఒక్కరికి భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసిన నేపథ్యంలో, పరకామణి కేసు విచారణ వేగం పుంజుకునేలా అవకాశాలు కనిపిస్తున్నాయి.



## దూసుకువస్తున్నా సేన్యార్

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

సేన్యార్ తుఫాన్ అండమాన్ నుంచి ఒక పిడనం గా ఏర్పడింది, రేపటికి అల్పపీడనం గాను, 24 నాటికీ వాయుగుండంగా బలపడి 26వ తేదీ నాటికీ తుఫాన్ గా మారే సూచనలు 100 శాతం గాలులతో తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. వచ్చే 26, 27, 28, 29, 30 తేదీలతో పాటు డిశంబర్ 1, 2 తేదీల్లో సెన్యార్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపుతుందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ తుఫాన్ ఎక్కడ తీరాన్ని దాటుతోంది, అనేది దాని గురించి ఇంకా స్పష్టత రాలేదు. అక్టోబర్ లో వచ్చే తుఫాన్ లను అంచనా వెయ్యగలం, నవంబర్ లో వచ్చే తుఫాన్ అంచనా వైయడం కష్టం కాకపోతే మనకు సమయం దగ్గర కి వచ్చాక తీరాన్ని దాటే సూచనలు అధికంగా ఉండోచ్చని తెలిపింది. తమిళనాడు చెన్నై, ఆంధ్రప్రదేశ్ - నెల్లూరు ,కాకినాడ మధ్య ఒడిస్సా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ ఎక్కడైనా తీరాన్ని దాటొచ్చు. ముందుగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ముఖ్యంగా వరి పండించిన రైతులు తమ ధాన్యన్ని జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. రోడ్లు పైన లేదా ఖాళీ స్థలాల్లో అరబెట్టిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ తుఫాన్ ప్రభావంతో ఆస్థి , ప్రాణ నష్టంతో పాటు రోడ్లపై ఉన్న ఎత్తైన చెట్లను నరికించడం ముందస్తు చర్యల్లో హ భాగంగా తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ చివరలో వచ్చిన మంధా తుఫాన్ తీవ్రతతో చెట్లు, విద్యుత్ స్తంబాలు వరగడంతో విద్యుత్ కోతలు ఎదుర్కోవలసి వచ్చింది. అలా జరగకుండా ముందుగానే జాగ్రత్త లు తీసుకుంటే కొంతమేరకు ఉపశమనం పొందవచ్చు. విద్యుత్ తీగలపై వేలాడే చెట్ల కొమ్మలు తొలగించాలని . లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాల్సిందిగా ప్రభుత్వం అధికారులకు అదేశాలు జారీ చేసింది.



## ఇక్కడ పుట్టడమే నేరమా?

**శ్రీకాకుళం (ఏడీఎన్ఎన్) :**

శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతాల్లో కిడ్నీ వ్యాధులు వేగంగా వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉద్దానం ప్రాంతంలో ప్రత్యేకంగా ప్రతి 100 మందిలో 18 మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని పరిశోధకులు వెల్లడించారు. అక్కడ ఎవరి ఇంటికెళ్లినా, ఎవరి మాట విన్నా కిడ్నీ వ్యాధుల గురించే చర్చలు వినిపిస్తున్నాయి. "ఇక్కడ పుట్టడమే నేరమా?" అని ప్రజలు వేదన వ్యక్తం చేస్తున్న స్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కిడ్నీ వ్యాధుల అసలు కారణాలను కనుగొనేందుకు వైద్య నిపుణులు విస్తృత పరిశోధన ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు వంటి మండలాల్లో అధ్యయనాలు కొనసాగుతున్నాయి. ఈ పరిశోధన కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ రూ.6.01 కోట్లను మంజూరు చేసింది. మూడు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో 5,500 మందిలో నుంచి రక్తం, మూత్రం వంటి నమూనాలు సేకరించనున్నారు. ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంతో జన్యుపరమైన పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. కిడ్నీ వ్యాధులు పర్యావరణ కారణాల వల్ల వస్తున్నాయా అనే దానిపై కూడా విశ్లేషణ జరుగుతోంది. అందుకోసం ఉద్దానం ప్రాంతంలోని మట్టి, నీరు, గాలి, వరిచేను, చేపలు, కూరగాయల నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఈ పరిశోధనపై జరిగిన సమావేశంలో కేజీహెచ్ కిడ్నీ విభాగాధిపతి డాక్టర్ జి. ప్రసాద్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ పరిశోధనల ద్వారా కిడ్నీ వ్యాధుల మూలాలు బయటపడతాయని, నివారణ చర్యలకు దోహదం అవుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

## ఏపీలో 11 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

**ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 11 కార్పొరేషన్లకు చైర్మన్లను శనివారం అధికారికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.**




ఈ నియామకాలతో వివిధ సామాజిక, భాషా, అభివృద్ధి రంగాల సంస్థలకు కొత్త నాయకత్వం అందింది.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నరసరావుపేటకు చెందిన కళ్యాణం శివశ్రీనివాసరావు, ఏపీ స్టేట్ అడ్వైజరీ ఆన్ చైల్డ్ లేబర్ చైర్మన్‌గా వేటుకూరి ఏవిఎస్ సత్యనారాయణ రాజు ,ఏపీ అఫిషియల్ లాంగ్వేజెస్ కమిషన్ చైర్మన్‌గా విక్రమ్ ,ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా విజయవాడకు చెందిన మౌలానా షిబిలి, ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా కడప జిల్లా యాతగిరి రాంప్రసాద్, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పూడా) చైర్మన్‌గా మాచర్లకు చెందిన చిరుమామిళ్ల మదుబాబు , ఏపీ స్టేట్ రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్‌గా ఇచ్చాపురంకు చెందిన కొండా శంకర్ రెడ్డి ,ఏపీ కుర్ని-కరికాల భక్తుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా యమ్మిగనూరుకు చెందిన మిన్నప్ప , ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్‌గా పొద్దుటూరుకు చెందిన ముక్తియార్, ఏపీ బట్రాజు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సత్తెనపల్లికు చెందిన సరికొండ వెంకటేశ్వరరాజు, ఏపీ స్టేట్ పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్‌గా పత్తిపాడుకు చెందిన వనపర్తి వీరభద్రరావు నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది .ఈ కొత్త నియామకాలతో రాష్ట్రంలోని పలు కార్పొరేషన్ల పనితీరులో వేగం, సమర్థత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత అభివృద్ధిలో లేబర్ కోడ్స్ కీలకం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

**దేశవ్యాప్తంగా అమలు కానున్న కొత్త లేబర్ కోడ్స్ పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా శనివారం స్పందించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత భారత అభివృద్ధి దిశలో ఇవి అత్యంత కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.**



కొత్త కార్మిక చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. కొత్త లేబర్ కోడ్స్ అమలుతో ఉద్యోగుల భద్రత మరింత బలోపేతం అవుతుంది. వేతనాల హామీ స్పష్టంగా నిర్ధారించబడుతుందని, కార్మికుల హక్కులు మరియు గౌరవం మెరుగుపడతాయని అన్నారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణ కల్పించడం ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు సమానత్వం, సురక్షిత వాతావరణం మరింత బలపడుతుందని చెప్పారు. భారత కార్మిక విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు దగ్గర చేయడంలో ఈ చట్టాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ యుగంలో భారత శ్రమ విధానాలను ఆధునికీకరించే దిశగా ఇవి సహాయపడతాయని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రాత్మక సంస్కరణలను ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు అభినందనలు తెలిపారు. కొత్త లేబర్ కోడ్స్ ఉద్యోగులు, యజమాన్యాలు, పరిశ్రమల మధ్య సమతౌల్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతం దిశగా సేనాని



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నిర్మాణంపై పూర్తి దృష్టి పెట్టారు. పార్టీ కమిటీల ఏర్పాటు, వాటి కూర్పు, కార్యకర్తల భాగస్వామ్యం వంటి అంశాలపై ఆయన వ్యూహాత్మకంగా పని చేస్తున్నారు.**

ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, స్థానిక కార్యకర్తల అభిప్రాయాలను తరచూ సమీక్షించాలని ఆయన పార్టీ ముఖ్యులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో జనసేనకు బలమైన నాయకత్వం ఉన్నట్లు హై కమాండ్ భావిస్తోంది. ఈ జిల్లాల్లో నాయకత్వాన్ని మరింత పటిష్టం చేసి, కార్యక్రమాల నిర్వహణను వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. అధినేత ఇప్పటికే ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి, వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, వీర మహిళలతో పార్టీ కేంద్ర కార్యాలయ బృందం చర్చలు నిర్వహిస్తోంది. కార్యకర్తల నుండి వస్తున్న సూచనలను నమోదు చేస్తూ, భవిష్యత్ కార్యాచరణలో వాటిని ప్రతిఫలింపజేయాలని జనసేన హై కమాండ్ కసరత్తు చేస్తోంది.

## జల వనరులపై జగన్‌ది కపట ప్రేమ


**పాలకొల్లు (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృష్ణా జల వివాదంపై వైసీపీ నేత జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వాదనలపై జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఐదేళ్లపాటు ప్రజలు అధికారంలో ఉంచినప్పుడు జల సమస్యలపై జగన్ ఏ చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు కపట ప్రేమ ప్రదర్శించడం ఆశ్చర్యకరమని మండిపడ్డారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించేలా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడింది చంద్రబాబేనని రామానాయుడు గుర్తుచేశారు. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఏపీ నీటి వినియోగంపై పునఃసమీక్ష కోరినా, జగన్ మౌనంగా ఉండటం రాష్ట్రానికి నష్టమని విమర్శించారు. ఆ సమావేశం నిర్ణయాల ఆధారంగా 2023 అక్టోబర్ 6న ట్రైబ్యునల్2 గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ, జగన్ మూడేళ్లపాటు స్పందించలేదని ఆయన ఆరోపించారు. గెజిట్ విడుదలకు ముందే సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేసే అవకాశం ఉన్నా వాడుకోలేదని, నోటిఫికేషన్ వచ్చిన రోజే ప్రధానిని కలిసి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను ప్రమాదంలోకి నెట్టారని రామానాయుడు ప్రశ్నించారు. రాయలసీమ అభివృద్ధిపై మాట్లాడుతూ, 2014-19 మధ్యలో చంద్రబాబు ప్రభుత్వం రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టగా, 2019-24లో జగన్ ప్రభుత్వం కేవలం రూ.2 వేల



కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని అన్నారు. ఐదేళ్లలో పూర్తి చేయలేని హంద్రీ-నీవా పనులను కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే రూ.3,860 కోట్లు ఖర్చు చేసి ముందుకు తీసుకెళ్లిందని వెల్లడించారు. మండుటెండల్లో కూడా రాయలసీమ జలాశయాలు నిండుగా ఉన్నాయంటే అది చంద్రబాబు కృషికి నిదర్శనమని రామానాయుడు పేర్కొన్నారు.

## మోస్ట్ వాంటెడ్ గజదొంగ అరెస్ట్



**శ్రీకాకుళం (ఏడీఎన్ఎన్) :**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడి ప్రజలకు ముప్పుగా మారిన మోస్ట్ వాంటెడ్ గజదొంగను శ్రీకాకుళం పోలీసులు అరెస్ట్ చేశారు.**

ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మీడియాకు తెలిపారు. మెలియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన దున్న కృష్ణ (55) గత 33 ఏళ్లుగా దొంగతనాలు చేస్తూ, ఇప్పటి వరకు 218 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని ఎస్పీ వివరించారు. ఇప్పటికే 60 కేసుల్లో జైలు శిక్ష అనుభవించినా, బయటకు వచ్చాక మళ్లీ అదే దారిలో నడిచినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని చెప్పారు. పోలీసుల సమాచారం ప్రకారం దున్న కృష్ణ ప్రధానంగా తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకునేవాడు. ఇప్పటి వరకు అతడు 50 కిలోల బంగారం, 300 కిలోల వెండి, 1 కిలో ప్లాటినం దొంగతనం చేసినట్లు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలో నమోదయ్యిన 18 కేసుల్లో రూ. 33.25 లక్షల విలువైన సొత్తు రికవరీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. దొంగతనాల్లో అతడికి సహకరించినవారిని గుర్తించేందుకు, మిగతా కేసులను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయని తెలిపారు. అరెస్ట్ తో జిల్లాలో ప్రజలు ఊరకపట్టారని, నేర చరిత్ర ఉన్న ఈ దొంగను పట్టుకోవడం పెద్ద విజయమని పోలీసులు పేర్కొన్నారు.

## శాస్త్రీయ ఆధారాలపై విచారణ జరగాలి

**తిరుమల (ఏడీఎన్ఎన్) :**

**తిరుమల లడ్డూల తయారీలో 2019 నుంచి 2024 వరకు నకిలీ నెయ్యి వాడారన్న ఆరోపణలను మాజీ టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యం, తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు.**



లడ్డూ నాణ్యతపై జరుగుతున్న సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామని, అవసరమైతే ఎప్పుడైనా విచారణకు హాజరుకావడానికి సిద్ధమని స్పష్టం చేశారు. శాస్త్రీయ ఆధారాలపై విచారణ జరగాలని, కానీ మీడియా లీకులు, రాజకీయ ఆరోపణలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డూల్లో జంతువుల కొవ్వు వాడారన్న ఆరోపణలను మొదట చంద్రబాబు నాయుడే చేసిన విషయాన్ని సుబ్బారెడ్డి గుర్తుచేశారు. అప్పట్లో సుప్రీం కోర్టును ఆశ్రయించగా, సీబీఐ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా పాత ఆరోపణలనే కొత్తగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మొదట వెజిటబుల్ ఫ్యాట్ వాడారన్న ఆరోపణ, తర్వాత జంతు కొవ్వు వాడారన్న ఆరోపణగా మారడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. "ఎక్కడైనా ల్యాబ్ నివేదిక ఉందా? సిట్ అధికారికంగా ఏమైనా ప్రకటించిందా? లీకులు పేరుతో విషప్రచారం చేయడం ఎందుకు?" అని సుబ్బారెడ్డి ప్రశ్నించారు. అనుమానాస్పదంగా గుర్తించిన నాలుగు నెయ్యి ట్యాంకర్లను అప్పుడే తిరిగి పంపించామని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో, ఇప్పుడు నెయ్యి తిరిగి వచ్చిందన్న ప్రచారాన్ని స్పష్టీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. నెయ్యి ధరలపై వస్తున్న ఆరోపణలను కూడా ఆయన తిప్పికొట్టారు. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో కిలోకు రూ.326 ధరకు కొనుగోలు చేసిన నెయ్యి నకిలీదని చెప్పడం నిరాధారమని చెప్పారు. "అలా అయితే 2017-18లో రూ.276, రూ.279కు కొనుగోలు చేసిన నెయ్యి కూడా నకిలీ అవుతుందా? అప్పటి లడ్డూలు కూడా అపవిత్రమా?" అంటూ ప్రతిప్రశ్నించారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడం తీవ్రమైన తప్పు అని సుబ్బారెడ్డి హెచ్చరించారు. తిరుమల ప్రతిష్టను లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం భక్తుల మనోభావాలకు నష్టం కలిగిస్తుందని ఆయన అన్నారు.



## ప్రైవేట్ బస్సులో భారీగా పశు మాంసం

**సింగరాయకొండ (ఏడీఎన్ఎన్) :**

**ప్రకాశం జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న పశు మాంసాన్ని పోలీసులు పట్టుకున్నారు. సింగరాయకొండ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ ఘటన బయటపడింది.**

విశాఖపట్నం నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఎస్‌వీడీ వేదాంశ్ ట్రావెల్స్ బస్సులో గోమాంసం తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై బి. మహేంద్ర ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బస్సును ఆపి పరిశీలించగా, 11 థర్మాకోల్ బాక్సుల్లో ప్యాక్ చేసిన 550 కిలోల మాంసం కనిపించింది. మాంసాన్ని అక్రమంగా తరలించిన కేసులో బస్సు డ్రైవర్ విజయవాడకు చెందిన గుజ్జుల కిరణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత మండల పశువైద్యాధికారి హజరత్ మాంసాన్ని పరిశీలించి నమూనాలు సేకరించారు. ఈ నమూనాలను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించి, అది గోమాంసమో కాదో నిర్ధారించనున్నట్లు పోలీసులు తెలిపారు. మాంసాన్ని ఎవరు పంపించారు, ఎవరెవరూ బుక్ చేసుకున్నారు అనే వివరాలు తెలిసేలా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. మహేంద్ర వెల్లడించారు.

## రైతులు అరటి కూడా అమ్ముకోలేని పరిస్థితి

**మొదటిపేజీ తరువాయి....**

ప్రపంచవ్యాప్తంగా యంత్రీకరణ పెరిగినా చంద్రబాబు కొత్తగా నేర్పించేదేమీ లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా... 20 నెలల పాలనలో ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. "హెలికాప్టర్లు, విమానాలకు వెంటనే డబ్బులు ఇస్తారు. కానీ రైతుల ధాన్యం అమ్మిన డబ్బులు మాత్రం ఇవ్వరు. తెలంగాణ ప్రభుత్వం ఏపీ రైతుల ధాన్యం రానివ్వకపోయినా కేంద్రం, రాష్ట్రం ఏ చర్యా తీసుకోవడం లేదు" అని మండిపడ్డారు. "85 లక్షలమంది రైతుల్లో ఎంతమందికి క్రాప్ ఇన్సూరెన్స్ చేశారు? తుపానులు, వరదలు ధ్వంసం చేసిన పంటలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దిగువ కులాల రైతుల, పేదల ఎస్సైన్డ్ భూములను లాక్కునే ప్రయత్నాలు మాత్రమే చేస్తున్నారు." రైతులకు ఎన్నికల ముందుగా ఇచ్చిన హామీలన్నీ వాగ్దానాలుగానే మిగిలిపోయాయని, పెట్టుబడి సాయం, ధరల స్థిరీకరణ నిధి వంటి అంశాల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ప్రధానిని పలుమార్లు కలిసినా రాష్ట్రానికి మేలు చేసే ఒక్క మాట కూడా అడగలేని స్థితిలో కూటమి నాయకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. బుడమేరు వరదలు, దళ్వాకు సాగునీరు, మొంథా తుఫాను నష్టాలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇరిగేషన్ పరిజ్ఞానం లేని వ్యక్తులు జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొంటూ... "జగన్ హయాంలో రైతులు గౌరవంగా బతికారు. కానీ ఇప్పటి పాలన రైతుల్ని రోడ్డున పడేసింది. 20 నెలలుగా రాష్ట్రానికి ఏ మేలు జరిగిందో కూటమి నాయకులు చెప్పాలి," అని పేర్ని నాని సవాలు విసిరారు.

## సత్యసాయి ఆశీస్సులతో అగ్రస్థానంలోకి భారత్

**మొదటిపేజీ తరువాయి...**

నవంబర్ 22 ప్రత్యేకత గురించి తెలుసుకున్న వెంటనే కార్యక్రమానికి రావాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. ఇప్పటికే పలువురు దేశ ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. సత్యసాయి బాబా విద్య ద్వారా సమాజ సేవకు అంకితభావం కలిగిన నాయకులను తీర్చిదిద్దారని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు నాటడంలో ఈ విద్యాసంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. విద్యార్థులు రాజకీయాల్లో అడుగు పెట్టాలని మంత్రి లోకేశ్ చేసిన పిలుపును అందరూ స్వాగతించారని తెలిపారు. "ప్రతి రోజు జీవితంలో కీలకం... ఆధ్యాత్మికత, సేవాభావం, క్రమశిక్షణ - ఇవన్నీ సత్యసాయి విద్యాసంస్థల ప్రధాన బలాలు" అని అన్నారు. సత్యసాయి వర్సిటీ వ్యక్తిత్వ వికాసానికి ప్రతీకగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. "సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో భగవాన్ సత్యసాయి భూమిపైకి వచ్చారు. ప్రేమ, సేవాభావం, క్రమశిక్షణ ఇవన్నీ ఆయన బోధనలు" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.

## విశిష్టమైన విద్యకు విద్యార్థులే ప్రతిరూపాలు

**మొదటిపేజీ తరువాయి...**

భారతదేశం వేల సంవత్సరాలుగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచానికి పంచుతున్నదని గుర్తుచేసిన చంద్రబాబు, 1990ల తర్వాత సాంకేతిక పురోగతి ప్రారంభమై ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. "హైదరాబాద్ సహా అనేక భారతీయ నగరాలు అంతర్జాతీయ ఐటీ హబ్‌లుగా ఎదిగాయి. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్ దేశంగా నిలవడం ఖాయం" అని ధైర్యంగా చెప్పారు.దేశ యువత, విద్యార్థులు భారత భవిష్యత్తుకు కాపాడువారుగా నిలవాలని పిలుపునిచ్చిన సీఎం, నిజాయితీ, కరుణ, నిస్వార్థ సేవ విలువలను ఆచరించాలని సూచించారు. "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బలమైన నాయకత్వం, దేశంలోని విస్తృత జనాభా మనకు గొప్ప అవకాశాలను అందిస్తున్నాయి. ఇవన్నీ సద్వినియోగం చేసుకుని భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది" అని అన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా తెలుగు వారు ఉన్నత స్థానంలో నిలవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సాయి బాబా సిద్ధాంతాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చిన చంద్రబాబు, వెల్తీ, హెల్తీ, హ్యాపీ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని అన్నారు. కోయంబత్తూరు గాంధీగా పేరుగాంచిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని ఆయన కొనియాడారు. సత్యసాయి జయంతి వేడుకలకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సహా రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న ప్రముఖులు హాజరవడం సత్యసాయి బాబా మహిమకు నిదర్శనమని సీఎం చెప్పారు.పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా పవిత్ర భూమి అని పేర్కొన్న చంద్రబాబు, ఈ నేల యావత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక శాంతి, సేవా భావం పంచుతుందని అన్నారు.



## హైదరాబాద్‌లో ముగిసిన రాష్ట్రపతి పర్యటన

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన ముగిసింది. ఒకరోజు పర్యటన కోసం శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి... బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభించారు. భగవాన్ సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆమె శనివారం ఉదయం పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎస్ కె.రామకృష్ణారావు తదితరులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.



## చెరుకు రైతుల సమస్యలపై కమిటీ

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ఉన్నతాధికారులతో ఒక కమిటీని నియమిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. శనివారం నాడు సచివాలయంలో ఆయన చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, చెరుకు అభివృద్ధి మండళ్ల ఛైర్మన్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమేవేశం నిర్వహించారు.**

తెలంగాణాలో ఏటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల సమస్యలు కూడా పరిష్కరించాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలపై అందరితో చర్చించి నివేదిక రూపొందించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించనున్నట్టు ఆయన వెల్లడించారు. సమావేశంలో తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, చక్కెర పరిశ్రమల డైరెక్టర్ నర్సిరెడ్డి, పలువురు అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, సిడిసి ఛైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.



## ఇందిర మహిళా శక్తి చీరలు పంపిణీ చేసిన ఎంపీ చామల

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

జనగామ జిల్లా కేంద్రం లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ జరిగింది.,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న అధికారులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్ రాజీనామా?

మొదటిపేజీ తరువాయి...

వీరిలో 8 మంది విచారణకు హాజరవ్వగా, కడియం తాజాగా గడువు కోరారు. దానం మాత్రం స్పందించలేదు. ఆదివారం లోపు స్పీకరుకు సమాధానం చెప్పలేదంటే.. ఆయన రాజీనామాకు వెళ్తున్నట్టే భావించాల్సి వస్తుంది! తాము ఏ పార్టీలోకి ఫిరాయించలేదని మిగిలిన 8 మంది స్పీకరుకు రిప్లై ఇచ్చారు. విచారణలోనూ అదే చెప్పారు. దానం, కడియంలు మాత్రమే స్పీకరు నోటీసులకు స్పందించలేదు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం... కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయన కూతురు కడియం కావ్య ఏకంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తే... ఆమె తరఫున ప్రచారం చేశారు. దీంతో దానం, కడియం ఇద్దరూ కాంగ్రెస్‌తో కలిసి పనిచేశారనే ఆధారాలను బీఆర్ఎస్ పార్టీ కోర్టులకు రుజువులుగా చూపెట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు స్పీకరును కలిసిన కడియం... సమాధానం ఇవ్వడానికి తనకు మరింత గడువు కావాలని కోరారు. కానీ దానం మాత్రం దీనిపై తాడోపేడో తేల్చుకోవడానికే అన్నట్టుగా హైకమాండ్‌ను కలిసేందుకు వెళ్లారు. మరోవైపు కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఈ వ్యవహారంపై దృష్టి పెట్టింది. మొత్తం 10 మందిలో... కడియం, దానం నాగెందర్ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్టు సమాచారం. ఎన్నికలొచ్చినా... తాము సిద్ధమేనని వారిద్దరూ పలుమార్లు ప్రకటించడం గమనార్హం. అయితే.. దానం మాత్రం మళ్లీ పోటీ చేసే గెలిస్తే... మంత్రి పదవి కావాలని అధిష్టానంతో మంతనాలు జరిపారని చెబుతున్నారు. రాజీనామా విషయంలో కడియం వెనకాముందు అవుతున్నా... దానం మాత్రం ఎన్నికలను ఎదుర్కొనేందుకే డిసైడ్ అయ్యారని తెలుస్తున్నది.

## కేంద్రంతో రెయిన్ బో హాస్పిటల్ ఒప్పందం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**తలసీమియా బాల సేవా యోజన కార్యక్రమం కింద కోలిండియా లిమిటెడ్‌తో రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి హాజరై ప్రసంగించారు.**

తలసీమియా బారిన పడిన పిల్లల తల్లిదండ్రుల కష్టసుఖాల్లో ఎప్పుడూ నేను భాగస్వామిగా ఉండేవాడిని. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే వైఎస్ రాజశేఖర్ రెడ్డి దగ్గరికి వెళ్లి తలసీమియా బాధితులకు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. చాలా దయనీయమైన పరిస్థితుల్లో పేద తల్లిదండ్రులు ఎంతో కష్టపడేవారని వారికి ఎలాగైనా అండగా ఉండాలని తపన పడేవాడినని ఆయన పేర్కొన్నారు. తలసీమియా బాధితులకు అండగా ఉండేందుకు కోలిండియా తీసుకొచ్చిన తలసీమియా బాలసేవా



యోజన కార్యక్రమం ద్వారా రెయిన్ బో ఆస్పత్రి అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా అనేక రంగాల్లో కోలిండియా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని 2005లో ఎమ్మెల్యే కావడానికి ముందు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణతో కలిసి అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నట్టు కిషన్ రెడ్డి తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతుంటే పేద పిల్లలు పోషకాహారం లేకపోవడంతో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారని అలాంటి వారిని గుర్తించేందుకు మందకృష్ణతో కలిసి సర్వే నిర్వహించి, 3 వేల మంది బాధితులను గుర్తించామన్నారు. మందకృష్ణతో కలిసి ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గుండె సంబంధిత బాధితులకు న్యాయం జరిగేలా ధర్నా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.తెలంగాణలో తలసీమియాతో బాధపడుతున్న వారికి ఎముక మజ్జ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసేందుకు కోలిండియాతో రెయిన్ బో ఆస్పత్రి ఒప్పందం చేసుకోవడం మంత్రిగా గర్వపడుతున్నట్టు తెలిపారు. తలసీమియాతో బాధపడే పిల్లలకు చికిత్స అందించడం చాలా కష్టమైన పని. ఆర్థికంగానే కాకుండా మానసికంగా కూడా ఎంతో కుంగిపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో కోలిండియా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా ప్రతి బాధితుడికి రూ.10 లక్షల మేర ఆర్థిక సాయం అందజేస్తున్నామని ఇప్పటి వరకు 17 ఆస్పత్రులతో ఒప్పందం చేసుకున్నాం. ఇప్పుడు రెయిన్ బోతో ఒప్పందం చేసుకున్నాం. ఇప్పటి వరకు 800 మంది పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ జరిగింది. వారందరికీ కొత్త కాంతులు తీసుకొచ్చాం. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్న రెయిన్ బో హాస్పిటల్ ను ఆయన అభినందించారు.

## విద్యతోనే వ్యక్తిత్వ వికాసం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

గచ్చిబౌలి శాంతి సరోవర్ లో బ్రమమహరీస్ ఆధ్వర్యంలో విద్యావేత్తలు రేపటి భవిష్యత్ తరానికి నిర్మాతలకార్యక్రమం నిర్వహించారు., ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,విద్యార్థులకు రేపటి భవిష్యత్ నిర్మాణానికి విద్యావేత్తలు వాటిని బోధించే విలువలు ,నైపుణ్యాలు, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ తదితర వాటిపై ఉపాధ్యాయులకు బ్రహ్మకుమారీస్ అవగాహన కల్పిస్తుందని తెలిపారు.,బ్రహ్మకుమారీస్ డాటర్ ఆఫ్ బ్రహ్మాస్ ఇది ఆధ్యాత్మిక ఉద్యమమని,1930 లో సింథ్ లో స్థాపించి 1950 లో రాజస్థాన్ లోని మౌంట్ అబూ కి వెళ్ళిందని తెలిపారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో విద్యావంతులు ,మేధావులు విద్యార్థుల్లో సానుకూల ఆలోచన ,స్వీయ నిర్వహణ నాయకత్వం ,జీవన విలువలు పెంపొందించెందుకు కృషి చేయాలని కోరారు.,భారత వ్యవస్థలను నిర్మితం చేసేది అధ్యాపకులు విద్యావంతులని పేర్కొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థి నాయకుడిగా రాజకీయా




ల్లోకి వచ్చానని విద్యా వ్యవస్థను దగ్గరి నుండి చూస్తూ వచ్చానని చెప్పారు. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యా దేవోభవగా తల్లిదండ్రుల తో సమానంగా గురువులను గౌరవించుకుంటామని తెలిపారు. ప్రపంచమంతా ఉరుకులు,పరుగులు ఉన్న వ్యవస్థలో 130 దేశాల్లో బ్రహ్మకుమరీస్ తమ ఆధ్యాత్మిక కార్యకలాపాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. మానవీయ సంబంధాలు విలువలు ,వ్యక్తిత్వ నిర్మాణం ,సంస్కారం పై నడుస్తుందని మంత్రి తెలిపారు

## 29న 'దీక్షా దివాస్' ఘనంగా నిర్వహించాలి




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఈ నెల 29న 'దీక్షా దివాస్'ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలిపారు. దశాబ్దంన్నర క్రితం, పార్టీ అధినేత కేసీఆర్ 'తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సందర్భాన్ని స్మరించుకోవాలన్నారు.

తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని దీక్షా దివాస్‌ను పెద్దఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి కేటీఆర్ శనివారం నాడు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దీక్షా దివాస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు. దీక్షా దివాస్ నిర్వహణకు ముందుగా, ఈ నెల 26వ తేదీన అన్ని జిల్లాల పార్టీ కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సహా ఇతర కీలక నాయకులందరినీ ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశాల ముఖ్య ఉద్దేశం, నవంబర్ 29న పార్టీ ఘనంగా నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

## నిర్లక్ష్యం కారణంగా రూ.196 కోట్లు ఎక్స్ ట్రా వ్యయం!

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**- ప్రభుత్వ విధానపరమైన లోపాలు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వెరసి.. బల్దియా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులను నత్తనడకన నడిపిస్తూ ఏళ్ల తరబడి సాగదీసి... అంచనా వ్యయాలను రెట్టింపు చేసేస్తున్నారు. పనుల ప్రారంభానికి ముందున్న అంచనాలు.. పూర్తయ్యే నాటికి తడిసి మోపెడు అవుతున్నాయి.**

ప్రతి ప్రాజెక్టులో 20 నుంచి 38 శాతం పెరుగుదల కనిపిస్తూనే ఉంది. తాజాగా నల్గొండ క్రాస్ రోడ్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ ఒవైసీ జంక్షన్ కారిడార్ వరకు 2.53 కి.మీల మేర రూ.523.37 కోట్లతో నిర్మించ తలపెట్టిన స్టీల్ వంతెన పనులకు 2020 జూలై మొదట్లో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థా




పన చేశారు. ఈ ప్రాజెక్టు 2024 మే నాటికల్లా పూర్తి చేయాల్సి ఉంది.. కానీ ఏళ్ల తరబడి ఈ పనులు నత్తకు నడకలు నేర్పుతుండడం చందంగా స్టీల్, ఇతర ధరల పెరుగుదల దృష్ట్యా రూ.523.37 కోట్ల ప్రాజెక్టు కాస్త వ్యయాన్ని రూ.620 కోట్లకు గ్రాఫ్ పెంచేశారు. దీంతో జీహెచ్ఎంసీ ఖజానాపై అదనంగా రూ.96.63 కోట్ల భారం పడింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పనులు 65 శాతం మాత్రమే పూర్తి చేసుకోగా.. వచ్చే మే నాటికల్లా ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా ఖరారు చేసుకుని పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే స్టీల్ ధరలు పెరిగాయన్న సాకు చూపి మరో రూ.100 కోట్ల మేర అదనపు భారం మోపేందుకు ప్రాజెక్టు విభాగం అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదే జరిగితే అధికారుల రెండేళ్ల నిర్లక్ష్యం ఖరీదు దాదాపు రూ.196 కోట్లు ప్రజలపై భారం పడేలా ఉంది. ఆర్టీసీ క్రాస్ రోడ్ స్టీల్ బ్రిడ్జికి రూ.139 కోట్ల అంచనా వ్యయం పెంచినట్లుగానే నల్గొండ క్రాస్‌రోడ్ స్టీల్ బ్రిడ్జి ప్రాజెక్టుకు ఇష్టాను సారంగా ప్రాజెక్టు వ్యయాన్ని పెంచుతుండడం పట్ల అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పుమంటున్నాయి. అంతేకాకుండా ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ రూ.311 కోట్లతో చేపట్టగా, ప్రాజెక్టు పూర్తి అయ్యే నాటికి మరో 30 శాతం మేర అదనంగా భారం ఖజానాపై పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో టెండర్ల పిలుపు నుంచి సంబంధిత ప్రాజెక్టు పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయలేకపోతున్నారు. సీఈ నుంచి ఎస్ఈలను అదనపు బాధ్యతల భారాన్ని తగ్గించి ఇంజినీరింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, ఈ దిశగా కమిషనర్ కర్ణన్ చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పేషెంట్‌కు మెంటల్ ఎక్కిస్తున్న వైనం..!

నిజామాబాద్ (ఏడీఎన్ఎన్) :

నిజామాబాద్ జిల్లాలో ఇటీవల ఓ డెంటల్ డాక్టర్‌పై మహిళ ఫిర్యాదు చేయడం తెలిసిందే. తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, వాట్సప్‌లో వీడియో, ఆడియో కాల్స్ చేస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సదరు కేసులో నిందితుల వేధింపులకు సంబంధించిన సాక్ష్యాలను సైతం చూపించగా, పోలీసులు నిర్భయ సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు. అయితే, పలుకుబడి ఉన్న ఓ సంఘం నేత మధ్యవర్తిత్వంతో జరపగా లక్షల రూపాయలు చేతులు మారడంతో నామమాత్రపు కేసులతో మమ అనిపించారనే చర్చ జరుగుతోంది. బాధితురాలు నేరుగా నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనను డెంటల్ డాక్టర్ అమర్, అయిల్



గంగాధర్ అనే వ్యక్తులు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వెంటనే నాన్ బెయిలబుల్ కేసు పెడతామని చెప్పినట్లు తెలిసింది.

## స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్‌పై చర్చాగోష్ఠి

◆ తెలంగాణ – నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్


హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్లో భాగంగా శనివారం నాడు "స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్ – కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్" అనే అంశంపై విశిష్ట చర్చాగోష్టి నిర్వహించారు.**

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల నుంచి ప్రముఖ క్రీడాకారులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలంగాణలో క్రీడల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. బ్యాడ్మింటన్ స్టార్ పుల్లెల గోపీచంద్ తన అకాడమీ నిర్వహణ, ప్ర




తిభావికాస విధానాలపై మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఫుట్ బాల్ స్టార్ బయ్ చింగ్ భూటియా క్రీడా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై ప్రాధాన్యతను వివరించారు. మణిపూర్ వెయిట్ లిఫ్టింగ్ స్టార్, పద్మశ్రీ మీరాబాయి చాను క్రీడల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేసి, వాటి పరిష్కార దిశలో సూచనలు చేశారు. అర్జున అవార్డు గ్రహీత బాక్సర్, ఎల్. సరితాదేవి క్రీడాకారుల తీర్చిదిద్దడంలో కోచ్‌ల కీలకపాత్రను విశదీకరించారు. త్రిపురకు చెందిన అర్జున అవార్డు గ్రహీత మంతు దేవనాద్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల అభివృద్ధిలో అకాడమీల ప్రాధాన్యాన్ని వివరించారు.




## అందెశ్రీ ఒక కోహీనూర్ వజ్రం

సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

**కవులు ఎంత మంది ఉన్నా తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రంలా నిలిచిపోతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పెన్నులపైన మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయని, గడీలను కూల్చుతాయని అందెశ్రీ నిరూపించారన్నారు.**


రవీంద్రభారతిలో శనివరం సాయంత్రం జరిగిన అందెశ్రీ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అందె శ్రీ తనకు అత్యంత అప్తుడు... మనసుకు దగ్గరి వాడు అన్నారు. ఇప్పుడు తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటను నిత్యం పాడుకుంటున్నారని తెలిపారు. అందె శ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అన్నారు. తెలంగాణలో ప్రజా పాలన రావాలని గద్దర్, అందెశ్రీ కోరుకున్నారని పేర్కొన్నారు. అందె శ్రీ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం.. అందె శ్రీ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నాం, ఆయన పుస్తకం నిప్పుల వాగును ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.



## బీమన్న గుట్టను కాపాడండి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

నిర్మల్ జిల్లా కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న భీమన్న గుట్టను కాపాడాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కు ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎంపీ ఈటల రాజేందర్ ను శనివారం క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ కోర్ కమిటీ నాయకులు కలిశారు. ఎన్నో ఏళ్లుగా భీమన్న గుట్టపై పండ్ల చెట్ల పెంపకం చేస్తూ జీవనోపాధి గడుపుతున్నామని మరియు భీమన్న గుట్ట వద్ద ముదిరాజుల ఆరాధ్య దైవం అయిన ముదిరాజులు కొలిచే భీమన్న దేవుడి గుడి ఉన్నదని, ముదిరాజుల సెంటిమెంట్ కు సంబంధించిన విషయం కాబట్టి భీమన్న గుట్ట ఆక్రమణకు గురవుతోందని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఆయనకు విన్న వించారు,ఈ విషయమై ఈటల రాజేందర్ స్పందిస్తూ మంత్రులు, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి భూమిని ముదిరాజ్ సంఘానికి ఇప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు



## అసిస్టెంట్ పైలట్‌పై పైలట్ అత్యాచార యత్నం..

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

మహిళా అసిస్టెంట్ పైలట్‌పై ఓ పైలట్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. హైదరాబాద్ బేగంపేటలోని ఓ ఏవియేషన్ సంస్థలో యువతి (26)తో పాటు రోహిత్ శరణ్(60) కమర్షియల్ పైలట్లుగా పనిచేస్తున్నారు. ఈ నెల 20న సంస్థకు చెందిన పనినిమిత్తం బిజినెస్ ఫ్లైట్‌లో బేగంపేట నుంచి పుట్టపర్తి మీదుగా బాధితురాలు బెంగళూరు వెళ్లింది. ఆమెతోపాటు నిందితుడు కూడా వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో అసిస్టెంట్ పైలట్‌తోపాటు మరో ఇద్దరు పైలట్లు బస చేశారు. హోటల్ గదిలో ఒకే గదిలో నిద్రించిన ఆమెపై రోహిత్ శరణ్ అత్యాచారయత్నం చేశాడు. ప్రతిఘటించిన ఆమె అక్కడి నుంచి పారిపోయి హైదరాబాద్ చేరుకుని ఆ తర్వాత పైలట్ తనపై లైంగికదాడికి యత్నించాడని బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రోహిత్ శరణ్‌పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఘటన బెంగళూరు హలసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది కాబట్టి మా పరిధిలేని కారణంగా కేసును అక్కడి నుంచి బెంగళూరుకి బదిలీ చేశారు.

## మూడు దశల్లో పంచాయితీ

మొదటిపేజీ తరువాయి....

వార్డులకు సంబంధించి 2024లో సర్కారు చేపట్టిన సమగ్ర కులగణన ఆధారంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అయితే సర్పంచుల విషయంలో... ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు వర్తింపజేశారు. ఇక బీసీలకు మాత్రం 2024 కులగణన సర్వే ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తారు. మహిళల రిజర్వేషన్లు కూడా ప్రతి వర్గంలో 50 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగానే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. విశ్రాంత ఐ.ఎ.ఎస్. అధికారి బూసాని వెంకటేశ్వర్ రావును బీసీల రిజర్వేషన్లపై ఏకసభ్య కమిషన్ వేయడం తెల్సిందే. సమగ్ర కులగణన సర్వే గణాంకాల ఆధారంగా... స్థానిక ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్లపై ఆయన అధ్యయనం చేసి, సంబంధిత వర్గాలను సంప్రదించి... అందరికీ ఆమోదయోగ్యమైన నివేదికను సిద్ధం చేశారు. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టుల తీర్పుతో... డెడికేటెడ్ కమిషన్ కూడా ఆ మేరకు కసరత్తు పూర్తిచేసి ఇటీవలే ప్రభుత్వానికి సమర్పించింది. తాజాగా జీవో46 విడుదల కావడంతో... రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. వార్డు సభ్యుల రిజర్వేషన్ల బాధ్యత ఎంపీడీఓలకు, సర్పంచ్ రిజర్వేషన్ల బాధ్యత ఆర్డీఓలకు ఇచ్చారు. ఈ జీఓకు మద్దతుగా సోమవారం గ్రామాల వారీగా రిజర్వేషన్ల రోస్టర్ విడుదల చేసే అవకాశాలున్నాయి. మంగళవారం కేబినెట్ భేటీ తర్వాత పంచాయతీ ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తారని భావిస్తున్నారు. డిసెంబరులో ప్రజాపాలన వారోత్సవాలు ముగిశాక... మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

## రాశి ఫలాలు

**23-11-2025 ఆదివారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగిపోతాయి. పిల్లలు పోటీ పరీక్షల్లోనూ, ఇంటర్వ్యూల్లోనూ విజయాలు సాధిస్తారు. ఆదాయం అనేక విధాలుగా వృద్ధి చెందుతుంది. బంధువులతో సఖ్యత, సాన్నిహిత్యం పెరుగుతాయి. ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలి. మీ ఆలోచనలు, ప్రయత్నాలను ఆచరణలో పెట్టడానికి ఇది మంచి సమయం.

**వృషభం:**
వృత్తి, ఉద్యోగాలు సానుకూలంగా, సంతృప్తికరంగా సాగిపోతాయి. వ్యాపారాలు నిలకడగా పురోగమిస్తాయి. కుటుంబ జీవితం ప్రశాంతంగా కొనసాగుతుంది. కొద్ది శ్రమతో కొన్ని ముఖ్యమైన పనులు, వ్యవహారాలు పూర్తవుతాయి. ఇంటా బయటా అనుకూలతలు ఉంటాయి.

**మిథునం:**
కొన్ని ముఖ్యమైన పనులు, వ్యవహారాలు అనుకున్నవి అనుకున్నట్టు పూర్తవుతాయి. వ్యక్తిగత జీవితం సంతృప్తికరంగా సాగిపోతుంది. కుటుంబ సభ్యులతో కొద్దిగా పారదర్శకంగా వ్యవహరించడం మంచిది. వృత్తి, వ్యాపారాలు కొత్త పుంతలు తొక్కుతాయి. ఆర్థికంగా రోజంతా అనుకూలంగా జరిగిపోతుంది.

**కర్కాటకం:**
ముఖ్యమైన పనులు, వ్యవహారాలు సంతృప్తికరంగా నెరవేరుతాయి. కుటుంబ సభ్యులతో ఇష్టమైన ఆలయాలు సందర్శించే అవకాశం ఉంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది. వృత్తి, ఉద్యోగాల వాతావరణం బాగా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. అనుకోకుండా కొన్ని మంచి పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:**
పెళ్లి, ఉద్యోగ ప్రయత్నాలు విజయం సాధించే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి పరవాలేదనిపిస్తుంది. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది. వృత్తి, ఉద్యోగాలు సాదాసీదాగా, నిలకడగా సాగిపోతాయి. వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.

**కన్య:**
వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా ముందుకు సాగుతాయి. కుటుంబ జీవితం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగిపోతుంది. ఆర్థిక పరిస్థితులు బాగా మెరుగ్గా ఉంటాయి. ఇంటా బయటా చిన్నపాటి సమస్యలున్నా వాటిని తేలికగా అధిగమిస్తారు. ఆర్థిక లావాదేవీలకు దూరంగా ఉండడం మంచిది.

**తుల:**
ఉద్యోగ జీవితం ఆశాజనకంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. బంధుమిత్రులతో కలిసి శుభకార్యంలో పాల్గొంటారు. ఆర్థిక సమస్యల ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడడానికి కొత్త ప్రయత్నాలు చేపడతారు.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపారాల్లో ఉత్సాహంగా ముందుకు సాగుతారు. నిరుద్యోగులకు ఆశించిన ఉద్యోగం లభించే అవకాశముంది. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ముఖ్యమైన వ్యవహారాలను చాలావరకు పూర్తి చేస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఒక వ్యక్తిగత సమస్యను కొద్ది ప్రయత్నంతో పరిష్కరించుకుంటారు.

**ధనస్సు:**
ఉద్యోగులకు ఆర్థికంగా కూడా ఊహించని అదృష్టం పదు తుంది. అన్ని రంగాల వారికి సమయం అనుకూలంగా ఉంది. ఏ ప్రయత్నమైనా సఫలం అవు తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ఆశించిన స్థిరత్వం లభిస్తుంది. కొందరు బంధుమిత్రులకు ఆర్థికంగా అండగా నిలబడతారు. మంచి పరిచయాలు ఏర్పడతాయి.

**మకరం:**
వ్యాపారాల్లో అంచనాలను అందుకుంటారు. ఇంటా బయటా అనుకూలతలు పెరుగుతాయి. ఆర్థిక పరి స్థితి బాగా మెరుగ్గా ఉంటుంది. పిల్లలు ఘన విజయాలు సాధిస్తారు. మిత్రుల నుంచి ఆర్థిక సహాయం కోసం ఒత్తిడి ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలు, పనులు తేలికగా పూర్తవుతాయి.

**కుంభం:**
ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు బాగా మెరుగ్గా ఉంటాయి. ఇతరుల వ్యవహారాల్లో తలదూర్చ వద్దు. సొంత వ్యవహారాల మీద శ్రద్ధ పెట్టడం మంచిది. పిల్లల నుంచి శుభవార్త అందుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. ఆస్తి వ్యవహారాల్లో సానుకూలతలు కనిపిస్తాయి.

**మీనం:**
వృత్తి, వ్యాపా రాలు చాలావరకు నిలకడగా సాగిపోతాయి. ఆర్థిక పరిస్థితి గతం కంటే బాగా మెరుగ్గా ఉంటుంది. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. ఉద్యోగపరంగా రావాల్సిన బకాయిలు కూడా వసూలవుతాయి. ముఖ్యమైన అవసరాలు తీరిపోతాయి.

# 'లాంగ్ స్టే టూరిజం'లో భారత్ టాప్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పర్యాటక ప్రియులకు ఎంత తిరిగినా తనివి తీరదు. అలాంటి వారి కోసం 'లాంగ్ స్టే టూరిజం' ట్రెండింగ్ లో వచ్చింది. ఈ టూరిజంలో భారతదేశమే టాప్ లో ఉంది. ఎందుకంటే భారత దేశంలోని ప్రకృతి సంపద, చారిత్రక కట్టడాలు, అపూర్వ శిల్పసంపదతో అలరారే పురాతన దేవాలయాలు, పర్వతాలు, సముద్ర తీరాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు దేశవిదేశీ యాత్రికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వాటిని చూడడానికి ఎన్నో లక్షల మంది ప్రతీ ఏడాది విదేశాల నుండి కూడా వస్తూంటారు. వీరు నెలల తరబడి భారత్ లోనే నివసిస్తూ.. దేశవ్యాప్తంగా పర్యటిస్తుంటారు. ఈ లాంగ్ స్టే టూరిజంలో సందర్శక ప్రాంతాలను సందర్శించడమే కాదు..అక్కడి సంస్కృతిసంప్రదాయాలను, జీవన విధానాలను అర్థం చేసుకుంటున్నారు. వర్క్ ఫ్రం హోం ఐటీ ఉద్యోగులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లున్సర్లు, ఫ్రీలాన్సర్లు వంటివారు ఈ లాంగ్ స్టే టూరిజంను ఇష్టపడుతున్నారు. దీనివల్ల వృత్తి జీవితంతో పాటు తమ వ్యక్తిగత జీవితాన్ని కూడా సమతుల్యంగా అనుభవిస్తున్నారు. మనదేశంలో టూరిజం చవకనే చెప్పాలి. జీవన వ్యయం కూడా చాలా దేశాల కంటే తక్కువ. భారత్ లోని రాష్ట్రాల వారీగా విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉంటాయి. అనేక కొత్త భాషలు నేర్చుకోవచ్చు. వారి జీవన విధానాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. దీనితో అన్నిరకాలుగా టూరిస్టులు వివిధ అనుభూతులు పొందుతారు. మనదేశంలో కేరళ, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, తమిళానాడు, గోవా వంటి క్షేత్రాలు చూడడానికి ఎక్కువ మంది టూరిస్టులు ఇష్టపడుతున్నట్లు ఒక సర్వేలో తేలింది. వీరికోసం పలు టూరిజం సంస్థలు, భారత ప్రభుత్వం ఈ లాంగ్ స్టే టూరిజం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.






## చిరుతపులినే బెదిరించిన 11 ఏళ్ల బాలుడు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో చిరుతల సంచారం ఎక్కువగా ఉంటుంది. అక్కడ తరచూ చిరుత పులులు, పెద్దపులులు జనావాసాల్లోకి చొరబడుతున్నాయి. తాజాగా మాలా పద్వీపాడ అనే ప్రాంతంలోని 5 వ తరగతి చదువుతున్న మయాంక్ కువారా అనే 11 ఏళ్ల బాలుడు స్కూల్ నుండి ఇంటికి వెళుతుండగా ఒక చిరుత దాడి చేసింది. అతని భుజాలకు తగిలించుకున్న స్కూల్ బ్యాగే అతడిని కాపాడిందని చెప్పాలి. పులి వెనుక నుండి బ్యాగ్ పై పంజాతో దాడి చేయగా..భయపడిన మయాంక్ ధైర్యం తెచ్చుకుని, తన స్నేహితునితో కలిసి పులిపై రాళ్లు రువ్వుతూ బెదిరించాడు. వారి అరుపులు విన్న గ్రామస్తులు పరుగున అక్కడికి రావడంతో పులి సమీపంలోని అడవికి పారిపోయింది. బాలుడి చేతికి పులిగోర్లు గీసుకోవడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. కాగా..చిరుతపులి సంచరించే ప్రాంతాలలో పాఠశాలలను 4 గంటలకే మూసివేయాలంటూ అటవీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. పులిని ధైర్యంగా ఎదుర్కొన్న మయాంక్ కువారాను అధికారులు ప్రశంసించారు.

## ఢిల్లీలో అమల్లోకి కఠిన ఆంక్షలు




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారత రాజధాని నగరంలో వాయుకాలుష్యం కోరలు విప్పుతోంది. కొన్నాళ్లుగా గాలినాణ్యత దారుణంగా పడిపోతోంది. తాజాకా సూక్ష్మ ధూళికణాల స్థాయిలు భారీగా పెరిగిపోవడంతో కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించారు వాయునాణ్యత నిర్వహణ కమిషన్. ఏక్యూఐ ప్రమాదకర స్థాయిలో క్షీణిస్తుండడంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ 3 ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనిలో భాగంగా పలు నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్ వంటి ప్రాంతాలలో గాలినాణ్యత స్థాయిని గుర్తించడం. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల పనివేళల తగ్గింపు. 50 శాతం మంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం. అనవసర నిర్మాణాలు, కూల్చివేత కార్యకలాపాలపై పూర్తి నిషేధం. సరుకు రవాణా వాహనాలు మినహా ఢిల్లీ బయట నమోదు చేసుకున్న పెట్రోల్, డీజిల్ వాహనాలపై ఈ నగరాల్లో నిషేధం. ప్రైమరీ పాఠశాలల మూసివేత. రైల్వే, మెట్రో, విమానాశ్రయాలు, రక్షణ రంగాలకు సంబంధించిన నిర్మాణాలు మినహా ఇతర నిర్మాణాలపై నిషేధం. ఢిల్లీలోని అనేక ప్రాంతాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలినాణ్యత సూచీ 400 దాటడంతో ప్రజలు గొంతు, తలనొప్పి, కళ్లమంటలు, నిద్రలేమితో బాధపడుతున్నట్లు తేలింది. కృత్రిమ వర్షాలు కురిపించినా లాభం లేకపోయింది.

# తేజస్ విషాదం.. తండ్రి వీడియో చూస్తుండగానే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



భారత్ కు చెందిన తేజస్ యుద్ధ విమానం విన్యాసాలు చేస్తుండగా కుప్పకూలింది. విమానం కూలిన వెంటనే మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పైలట్ వింగ్ కమాండర్ నామ్నాష్ సయాల్ దుర్మరణం పాలైనట్టు ఎయిర్‌ఫోర్స్ ధృవీకరించింది. ఈ ఎయిర్ షో వీడియోలను నమాంశ్ తండ్రి యూట్యూబ్ లో ఆసక్తిగా చూస్తున్న సమయంలో ఇలా జరగడంతో ఆయన షాక్ కు గురయ్యారు. నమాంశ్ తండ్రి జగన్నాథ్ స్యాల్ హిమాచల్ ప్రదేశ్ లోని కాంగ్రా పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి, రిటైర్ అయ్యారు. నమాంశ్ దుబాయ్ ఎయిర్ షో తేజస్ యుద్ధ విమాన దృశ్యాలను ఆ సమయానికి యూట్యూబ్ లో చూస్తున్నారు. అంతలోనే విమానం కూలిపోవడంతో ఆయన హతాశుడయ్యారు. వెంటనే వైమానిక దళంలో వింగ్ కమాండర్ గా ఉన్న కోడలికి ఫోన్ చేశారు. తర్వాత కొద్ది సేపటికే కొందరు అధికారులు ఇంటికి రావడంతో ఆయనకు ఘోరం జరిగిపోయిందని అర్థమయ్యింది. ఇది కేవలం ప్రమాదమా ? లేదా సాంకేతిక లోపమా? అనేది తేలాల్సి ఉంది. ఈ సంఘటన భారతదేశం మేక్ ఫర్ ది వరల్డ్ విధానానికి కూడా గణనీయమైన ఎదురు దెబ్బగా నిపుణులు భావిస్తున్నారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఈ విమానాన్ని తయారు చేశారు. బెంగళూరుకు చెందిన HAL సంస్థలో తేజస్ యుద్ధ విమానాన్ని తయారు చేశారు. దుబాయ్ ఎయిర్ షోలో భారత్ కు చెందిన ఎయిర్ ఫోర్స్ విమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయితే తేజస్ యుద్ధ విమానం ప్రమాదానికి గురి కావడం తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాద వీడియోలో పైలట్ చివరి క్షణం వరకు విమానాన్ని నియంత్రించడానికి ప్రయత్నించాడని తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాన్ని గుర్తించడానికి వైమానిక దళం ఉన్నత స్థాయి విచారణ చేయాలని అధికారులు ఆదేశించారు.


# ఈ నానోబాట్స్‌తో నొప్పి లేకుండా క్యాన్సర్ ఖతం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




క్యాన్సర్ రోగులు కీమోథెరపీతో నానా బాధలు పడుతుంటారు. ఈ చికిత్సలో క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలు కూడా కీమోథెరపీతో విచ్ఛిన్నం అవుతుంటాయి. అంతే కాక కీమో కారణంగా రోగులు చాలా నొప్పి, బాధ ఫీలవుతారు. అయితే తాజా ప్రయోగంలో దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు తయారు చేసిన అతి చిన్న నానోబాట్స్ ఈ సమస్యను సులువుగా పరిష్కరిస్తున్నాయి. ఐరన్ ఆక్సైడ్ తో తయారైన ఈ నానోబాట్స్ ని ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించవచ్చు. వాటిని ట్యూమర్లు ఉన్న చోటుకి అయస్కాంతశక్తి సహాయంతో పంపిస్తారు. తర్వాత ఇవి ఆరోగ్యకరమైన కణాలకి హాని చేయకుండా కేవలం క్యాన్సర్ కణాలని మాత్రమే నాశనం చేస్తాయి. ఈ పని పూర్తయ్యాక ఇవి ఐరన్ అయాన్లుగా మారి, రక్తంలో కలిసిపోతాయట. దీనివల్ల కీమో థెరపీతో వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడంతో రోగి త్వరగా కోలుకుంటారని వైద్యులు చెప్తున్నారు. త్వరలోనే ఇది అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

## వందేభారత్ స్లీపర్ ట్రైన్లకు ముహూర్తం ఖరారు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

వందే భారత్ రైళ్ల రాకతో లగ్జరీతో పాటు వేగంగా ప్రయాణం చేయగలిగే సదుపాయం ప్రజలుకు అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ ట్రైన్లలో ఛైర్ కార్, నార్మల్ సిట్టింగ్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. స్లీపర్ క్లాస్ ప్రస్తుతం సర్వీసులు అందిస్తున్న వందే భారత్ ట్రైన్లలో అందుబాటులో లేదు. అయతే త్వరలో స్లీపర్ క్లాస్ ట్రైన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ క్లారిటీ ఇచ్చారు. డిసెంబర్ నుండే వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం, అత్యంత ప్రమాణాలతో కూడిన ప్రయాణం అందించేందుకు ఒక్క చిన్న నిర్లక్ష్యం కూడా లేకుండా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కొత్త వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. 11 ఏసీ 3 టైర్, 4 ఏసీ 2 టైర్, ఒకటి ఏసీ ఫస్ట్ క్లాస్ ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, విజువల్ డిస్ ప్లే, కెమెరాలు, మాడ్యులర్ కిచెన్, నైట్ లైటింగ్ వంటి అత్యాధునిక కెమెరాలతో స్లీపర్ రైళ్లు త్వరలో పరుగులు తీయనున్నాయి. ఇక రీడింగ్ లైట్స్, పవర్ ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డోరింగ్ సిస్టం, ఎమర్జెన్సీ కమ్యూనికేషన్, ప్రతీ కోచ్‌లో సీసీటీవీ కెమెరా, రిజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం వంటివి కూడా ప్రతీ కోచ్ లో ఉండనున్నాయి.



## వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

**మహారాష్ట్ర (ఏడీఎన్ఎన్) :**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం. డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో ఓ కారు నియంత్రణ కోల్పోయి.. టూ వీలర్స్ పైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఓ వాహనం గాల్లో ఎగిరి కిందపడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోగా... మరికొందరు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఠాణె జిల్లాలోని అంబర్‌నాథ్ ఫ్లైఓవర్‌పై ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసేన పార్టీకి చెందిన స్థానిక ఎన్నికల అభ్యర్థి కిరణ్ చాబే ఎన్నికల ప్రచారం నుంచి తిరిగి వస్తుండగా.. కారు డ్రైవర్ షిండే గుండెపోటుకు గురయ్యారు. దీంతో వాహనం నియంత్రణ కోల్పోయి ముందున్న బైక్‌లు, ఇతర వాహనాలను ఢీకొట్టింది. కారు వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి బైక్‌తో సహా ఎగిరి ఫ్లైఓవర్ పై నుంచి కింద పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ టీవీల్లో రికార్డయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ షిండే, మరో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడగా.. వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో ఉన్న కిరణ్ చాబేను స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



## నీరవ్ మోదీ కార్లు వేలానికి గ్రీన్ సిగ్నల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ లోని బ్యాంకులను మోసం చేసి, విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి సీబీఐ కోర్టు షాకిచ్చింది. ఈ కేసులో ఈడీ చేసిన నీరవ్ మోదీ కార్లను వేలం వేయడానికి సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి అనుమతించారు. రూ.40 లక్షల విలువ చేసే బెంజ్ కారు, రూ.7.5 లక్షల విలువ చేసే స్కోడా కార్లను వేలం వేసి ఆ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మూడు కార్లు సీజ్ చేయగా..రెండు కార్లు వేలం వేయడానికి మాత్రమే అంగీకరించడం విశేషం.



## మెలోనీతో మోదీ ఫ్రెండ్‌షిప్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలు, మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. పలు అంతర్జాతీయ వేదికలపై వీరిరువురూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ అందరినీ ఆకర్షిస్తుంటారు. తాజాగా వీరి మధ్య స్నేహబంధం మరోసారి నెటిజన్లను ఆకర్షిస్తోంది. దక్షిణాఫ్రికాలో జీ20 వార్షిక సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్‌కు ప్రపంచాధినేతలు హాజరయ్యారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ కూడా వచ్చారు. ఈ సందర్భంగా స్టేజ్‌పై ఉన్న మెలోనీని ప్రధాని మోదీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా, ఇప్పటికే పలుమార్లు వీరిద్దరి ఫొటోలూ వైరల్ అయిన విషయం తెలిసిందే. దుబాయ్‌లో కాప్28 సదస్సు జరిగిన సమయంలో కూడా వీరి సెల్ఫీ ఫొటో వైరల్ అయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో కెనడాలో జరిగిన జీ7 సదస్సు సమయంలోనూ వీరి ఫొటో నెటిజన్లు ఆకర్షించింది.



## లైవ్ కాన్సర్ట్ లో మహ్మద్ రఫీ.. ఆశ్చర్యంలో ప్రేక్షకులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రముఖ బాలీవుడ్ సింగర్ సోనూ నిగమ్ ఇటీవల జమ్మూకశ్మీర్ లోని శ్రీనగర్ లో కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. ఇలాంటి కాన్సర్ట్స్ లో సోనూ నిగమ్ కి ఎంతో క్రేజ్ ఉంది. అయితే ఈ సంగీత కచేరీలో ఒక అద్భుతం చోటు చేసుకుంది. భారతీయ లెజెండరీ సింగర్ దివంగత మొహమ్మద్ రఫీ ప్రత్యక్షమై పాటలు పాడడంతో ప్రేక్షకులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ కచేరీలో రఫీకి సింగర్ సోను నిగమ్ అపూర్వ నివాళులర్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రఫీ గొంతును తిరిగి సృష్టించారు. ఆయనతో కలిపి డ్యూయట్ పాడారు. భారతీయ సంగీతానికి ఆత్మ వంటి మొహమ్మద్ రఫీ 100 వ జయంతి సందర్భంగా కాశ్మీర్ కి సోను నిగమ్ కొత్త జీవం పోశారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. భారత దేశంలోని గొప్ప గాయకుడిగా పేరు పొందిన రఫీ తన జీవిత కాలంలో హిందీ, ఉర్దూ, ఇతర ప్రాంతీయ భాషల్లో వేల పాటలు పాడారు. ఆరు ఫిల్మ్ ఫేర్ అవార్డులు, జాతీయ అవార్డు అందుకున్నారు. పద్మశ్రీ బిరుదుతో ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఇక సోను నిగమ్ అనేక భాషలలో పాడడంతో పాటు ఎన్నో దేశీ పాప్ ఆల్బమ్స్ కూడా రిలీజ్ చేశారు. ఆయనకు కూడా పద్మశ్రీ అవార్డు లభించింది. భారతీయ గాయకుల్లో అత్యధిక పారితోషకం అందుకునే గాయకునిగా ప్రఖ్యాతి గడించారు.



## అంతర్జాతీయ ఆయుధ రాకెట్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు..

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

అంతర్జాతీయ అక్రమ ఆయుధ స్మగ్లింగ్ ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్‌తో సంబంధం ఉన్న ఆయుధ సిండికేట్ గుట్టురట్టు చేశారు. చైనా, టర్కీలలో తయారైన ఆయుధాలు పాక్ నుంచి భారత్‌కు డ్రోన్ల ద్వారా సరఫరా అవుతున్నట్లు తెలుసుకున్నారు. నవంబర్ 19న అక్రమ ఆయుధ సరఫరాదారులు వాటిని అమ్మేందుకు ఢిల్లీలోని రోహిణి ప్రాంతానికి చేరుకున్నట్లు పోలీసులకు నిఘా సమాచారం అందింది. దీంతో రైడ్ చేశారు. పంజాబ్‌లోని ఫిలౌర్‌కు చెందిన మన్‌దీప్, లూథియానాకు చెందిన దల్విందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సమాచారం ఆధారంగా అనుచరులైన ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్‌కు చెందిన రోహన్ తోమర్, అజయ్ అలియాస్ మోనులను అరెస్ట్ చేశారు. సోను ఖత్రి ముఠాతో సంబంధం ఉన్న మన్‌దీప్‌పై హత్యతో సహా అనేక క్రిమినల్ కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుల నుంచి 10 అధునాతన పిస్టల్స్, 92 లైవ్ కార్ట్‌రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇందులో ఐదు పిస్టల్స్ టర్కీలోను, మూడు చైనాలోను తయారయినట్లు చెప్పారు. ఈ విదేశీ ఆయుధాలను పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్‌లోని రహస్య ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు వెల్లడించారు. స్కానర్లకు ఆనవాళ్లు పట్టుబడకుండా ఉండేందుకు ఆయుధాలను కార్బన్ పేపర్‌లో చుట్టి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మరోవైపు, డ్రాప్ లొకేషన్‌ల నుంచి ఆయుధాలు సేకరించి ఢిల్లీకి డెలివరీ చేయాలని పాక్ ఏజెంట్లు ఈ ముఠా సభ్యులకు సూచిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఢిల్లీ, పరిసర రాష్ట్రాలలోని నేరస్థులు, లారెన్స్ బిష్ణోయ్, బంబిహా, గోగి హిమాన్షు భాయ్ వంటి పేరు మోసిన ముఠాలకు అక్రమ ఆయుధాలను వీరు సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఈ ముఠా ఇప్పటి వరకు ఎన్ని ఆయుధాలు, ఎవరెవరికి విక్రయించారు, ఈ రాకెట్‌కు సంబంధించిన ముఠాలోని సభ్యులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



## షమీ రీ-ఎంట్రీకి అవకాశం?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ మళ్లీ క్రికెట్ మైదానంలో తన ఫిట్‌నెస్, ఫామ్‌ను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ 2025-26 కోసం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిన జట్టులో ఈ స్టార్ బౌలర్‌కు స్థానం లభించింది. నవంబర్ 26న హైదరాబాద్‌తో బెంగాల్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. బెంగాల్ జట్టుకు వెటరన్ బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, షమీతో పాటు టీమిండియా పేసర్ ఆకాష్ దీప్ కూడా జట్టులో ఉన్నాడు. వికెట్ కీపర్‌గా అభిషేక్ పోరెల్ ఎంపికయ్యాడు. గ్రూప్-సిలో బెంగాల్‌తో పాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, సర్వీసెస్, పుదుచ్చేరి, హర్యానా జట్లు పోటీపడనున్నాయి. మహ్మద్ షమీ టీమిండియా జట్టుకు చివరిసారి ఈ ఏడాది మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం ఫిట్‌నెస్ సమస్యల కారణంగా అతడిని సెలక్టర్లు పక్కన పెట్టినట్లు బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తెలిపారు. కానీ షమీ మాత్రం ఇటీవల తనను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నట్లు పరోక్ష విమర్శలు చేస్తూ సెలక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో షమీ కొనసాగుతున్న అద్భుత ఫామ్‌ను నిరూపించుకున్నాడు. రంజీ ట్రోఫీ 2025-26 తొలి దశలోనే 20 వికెట్లు తీసి తన పాత మాదిరి పేస్, రిథమ్‌లో తిరిగొచ్చాడని చూపించాడు. ఇప్పుడు ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా మంచి ప్రదర్శన కనబరిస్తే, రాబోయే న్యూజిలాండ్ టీ20 సిరీస్‌కు అతడికి రీఎంట్రీ దారులు తెరుచుకునే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), షకీర్ హబీబ్ గాంధీ, యువరాజ్ కేస్వానీ, ప్రియాంషు శ్రీవాస్తవ్, షాబాజ్ అహ్మద్, ప్రదీప్త ప్రమాణిక్, రిటిక్ ఛటర్జీ, కరణ్ లాల్, సాక్షం చౌదరి, మహ్మద్ షమీ, ఆకాష్ దీప్, సయన్ ఘోష్, కనిష్క్ సేథ్, యుధాజిత్ గుహా, శ్రేయాన్ చక్రవర్తి. బెంగాల్ జెర్సీలో షమీ ప్రదర్శన ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అతడి గనుక మళ్లీ మెరుపులు మెరిపిస్తే, టీమిండియా తలుపులు మరోసారి తెరుచుకోవడం ఖాయం.



## క్రిప్టో మార్కెట్‌లో కలకలం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆర్థిక అవగాహన కల్పించిన ప్రసిద్ధ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి తన వద్ద ఉన్న భారీ మొత్తంలో బిట్‌కాయిన్‌లను విక్రయించిన సంగతి ప్రకటించారు. మొత్తం 2.25 మిలియన్ డాలర్ల (సుమారు ₹20 కోట్లు) విలువైన బిట్‌కాయిన్లను ఒక్కొక్కటి సుమారు 90 వేల డాలర్ల ధర వద్ద అమ్మేశానని ఆయన తెలిపారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, కొన్నేళ్ల క్రితం ఒక్క బిట్‌కాయిన్‌ను కేవలం 6,000 డాలర్లకు కొనుగోలు చేశానని తెలిపారు. క్రిప్టో మార్కెట్ ఒత్తిడిలో ఉన్న ఈ సమయంలో, ఇప్పటికే బిట్‌కాయిన్ తిమింగలం ఓవెన్ గుండెన్ 1.3 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్‌లను విక్రయించిన వార్త వెలువడగా, కియోసాకి నుంచి కూడా ఈ ప్రకటన రావడం ఇన్వెస్టర్లను ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణంగా బిట్‌కాయిన్‌పై బుల్లిష్‌గా ఉండే కియోసాకి కూడా ఈ దశలో ఆఫ్‌లోడింగ్ చేయడం మార్కెట్ దృష్టిని ఆకర్షించింది. ఈ నిర్ణయం తన దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహంలో భాగమని కియోసాకి వెల్లడించారు. బిట్‌కాయిన్‌ల విక్రయం ద్వారా వచ్చిన లాభాలను "స్థిరమైన, పన్ను రహిత నగదు ప్రవాహం ఇచ్చే ఆస్తుల్లోకి మార్చున్నాను" అని తెలిపారు. విక్రయం ద్వారా వచ్చిన మూలధనంతో రెండు సర్జరీ సెంటర్లు, ఒక బిల్‌బోర్డ్ వ్యాపారంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. ఈ కొత్త పెట్టుబడులు వచ్చే ఫిబ్రవరి నుంచే నెలకు సుమారు $27,500 (సుమారు ₹23 లక్షలు) పన్ను రహిత ఆదాయం తీసుకురాగలవని అంచనా వేశారు. ఇవి ఇప్పటికే తన వద్ద ఉన్న రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోతో కలిపి మొత్తం నెలవారీ ఆదాయాన్ని "వందల వేల డాలర్లకు" తీసుకెళ్తాయని అన్నారు. బిట్‌కాయిన్‌లను అమ్మినప్పటికీ, దాని భవిష్యత్తుపై విశ్వాసం తగ్గలేదని కియోసాకి స్పష్టం చేశారు. "తాజా పెట్టుబడుల నుంచి వచ్చే నగదుతో మళ్లీ బిట్‌కాయిన్ కొనుగోలు చేస్తాను" అని చెప్పారు. ఈ చర్య బిట్‌కాయిన్‌ను విడిచిపెట్టడం కాదని, లాభాలను పన్ను ప్రయోజనాలు ఉన్న నగదు ప్రవాహ ఆస్తుల్లోకి మార్చడం మాత్రమే తన తత్వమని తెలిపారు. భద్రతా కారణాల వల్ల ఈ విక్రయాన్ని పబ్లిక్‌గా చెప్పొద్దని మిత్రులు సూచించినప్పటికీ, ప్రస్తుతం నకిలీ డబ్బు, నకిలీ గురువుల ప్రపంచంలో "నేను బోధించేది నేనూ అమలు చేస్తానని చూపడం ముఖ్యం" అని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గందరగోళ దిశగా కదులుతోందని హెచ్చరిస్తూ, అందరూ తమ సంపద పెంపు వ్యూహాలను పునరాలోచించాల్సిన సమయం ఇదేనని పిలుపునిచ్చారు. కియోసాకి బిట్‌కాయిన్ విక్రయం, పెట్టుబడి మార్పిడి, మరియు భవిష్యత్తు ఆర్థిక సూచనలు క్రిప్టో ఇన్వెస్టర్లలో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.



## బైజూస్‌కు యూఎస్ కోర్టు షాక్..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రముఖ ఎడ్ టెక్ సంస్థ బైజూస్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన సంగతి తెలిసిందే. తాజాగా బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ కు అమెరికా కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. బైజూస్ ఆల్ఫా పై , అమెరికాలోని గ్లాస్ ట్రస్ట్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్ పై అమెరికా కోర్టు డిఫాల్ట్ జడ్జిమెంట్ ఇచ్చింది. పిటిషనర్లకు బిలియన్ డాలర్లను వ్యక్తిగతంగా చెల్లించాలంటూ బైజూస్ రవీంద్రన్ ను ఆదేశించింది. గతంలో ఇచ్చిన తీర్పును రవీంద్రన్ పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఆదేశాలు ఇస్తున్నట్లు డెలావేర్ దివాలా పరిష్కార కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ బైజూస్ ఆల్ఫాను 2021లో అంతర్జాతీయ నిధులు సేకరించే ఉద్దేశంతో రవీంద్రన్ నెలకొల్పారు. బైజూస్ ఆల్ఫా 1 బిలియన్ టర్మ్ లోన్ ను గ్లాస్ ట్రస్ట్ డెలావేర్ నుండి పొందింది. ఈ అప్పుల్లో నుండి 533 మిలియన్ డాలర్లు అమెరికా నుండి చట్టవిరుద్ధంగా తరలించారని గ్లాస్ ట్రస్ట్ డెలావేర్ కోర్టును ఆశ్రయించింది. దీనితో రవీంద్రన్ కు మొత్తం అప్పులు తీర్చాలంటూ కోర్టు ఆదేశించింది.

# ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్

**❖ సెమీస్‌లో ఆసీస్ చిత్తు..**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ఐసీసీ అంధుల మహిళల టీ20 ప్రపంచకప్ 2025లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. శనివారం కొలంబోలో జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 9 వికెట్ల భారీ విజయంతో భారత్ తమ ఆధిక్యాన్ని చాటుకుంది. ముందుగా టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. టీమిండియా బౌలింగ్, ఫీల్డింగ్ రెండూ ఆస్ట్రేలియా బ్యాటర్లపై రెక్కలేసాయి. ఆరుమంది ఆసీస్ ఆటగాళ్లు రనౌట్ కావడం ఆ జట్టు ఇబ్బందులను మరింత పెంచింది. చనకన్ బువాఖావో (34) ఒక్కరే ప్రతిఘటించినప్పటికీ, పెద్ద స్కోరు సాధించే అవకాశాన్ని ఆసీస్ కోల్పోయింది. భారత బౌలర్లలో సిమ్రన్‌జీత్ కౌర్, జమునా రాణి, అను కుమారి చెరో వికెట్ తీసి మెరిశారు. తరువాత 110 పరుగుల ఛేదనకు వచ్చిన టీమిండియా ఆత్మవిశ్వాసంగా ఆడింది. కేవలం ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని సులభంగా సాధించింది. బసంతి హన్సా 45 పరుగులతో ప్రధాన పాత్ర పోషించగా, గంగా కదమ్ 41 నాటౌట్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. కె. కరుణ 16 నాటౌట్ చేసి అదనపు ధైర్యాన్ని ఇచ్చింది. ఈ గెలుపుతో భారత్ ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో భారత్‌కు ప్రత్యర్థి నేపాల్. రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి నేపాల్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అంధుల మహిళల క్రికెట్‌కు ఇది మరో మైలురాయిగా నిలవనుంది.

# ప్రపంచ రికార్డు సృష్టించిన ట్రావిస్ హెడ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా ఘన విజయంతో ఆరంభించింది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్‌పై 8 వికెట్ల తేడాతో కంగారూలు విజయం సాధించారు. ఇంగ్లాండ్ నిర్దేశించిన 205 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 28.2 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో మ్యాచ్ రెండో రోజుకే ముగిసింది. ఈ విజయంలో ప్రధాన ఆకర్షణ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఆట. అతడు 83 బంతుల్లో 123 పరుగులు (16 ఫోర్లు, 4 సిక్స్‌లు) బాదుతూ టీ20 తరహాలో దూకుడిగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 36 బంతుల్లో అర్ధశతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేసిన హెడ్ టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో వేగవంతమైన సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 1902లో ఇంగ్లాండ్ బ్యాటర్ గిల్బర్ట్ జెస్సోప్ 76 బంతుల్లో చేసిన సెంచరీ రికార్డును అతడు 123 ఏళ్ల తర్వాత బద్దలు కొట్టాడు. యాషెస్ చరిత్రలో వేగవంతమైన సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా కూడా హెడ్ నిలిచాడు. 2006లో ఆడమ్ గిల్‌క్రిస్ట్ 57 బంతుల్లో శతకం నమోదు చేసి మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఇన్నింగ్స్ తో హెడ్, డేవిడ్ వార్నర్ చేసిన వేగవంతమైన సెంచరీ రికార్డును కూడా సమం చేశాడు. వార్నర్ 2012లో వాకా స్టేడియంలో 69 బంతుల్లో సెంచరీ సాధించాడు. మ్యాచ్ మొత్తం 847 బంతుల్లో ముగియడం మరో విశేషం. యాషెస్ చరిత్రలో అత్యల్ప బంతుల్లో ముగిసిన మూడో మ్యాచ్‌గా ఇది నిలిచింది. 1888 ఓల్డ్ ట్రాఫోర్డ్ టెస్టు 788 బంతుల్లో, లార్డ్స్ టెస్టు 792 బంతుల్లో ముగిసిన నేపథ్యంలో పెర్త్ మ్యాచ్ మూడో స్థానంలో చోటు దక్కించుకుంది. ఆరంభ మ్యాచ్‌లోనే భారీ విజయం సాధించిన ఆస్ట్రేలియా సిరీస్‌కు మంచి ఊపు అందుకుంది.

# శ్రేయస్ అయ్యర్‌కు భారీ ఎదురుదెబ్బ



**2026 మార్చి వరకు ఆటకు దూరం ..?**


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయపాలైన తర్వాత ఆయన మైదానానికి దూరం కానున్న కాలం మరింత పెరిగే అవకాశమున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన మూడో వన్డేలో క్యాచ్ పట్టుకునే సమయంలో బలంగా నేలపై పడడంతో ఆయన ప్లీహా (spleen)కు తీవ్ర గాయం జరిగింది. ప్రస్తుతం చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నప్పటికీ, త్వరలోనే మళ్లీ బ్యాట్ పట్టే పరిస్థితి లేదని వైద్యులు సూచించినట్లు సమాచారం. తాజా అంచనాల ప్రకారం అయ్యర్ మార్చి 2026 వరకు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి సమయానికి ఆయన పూర్తిగా కోలుకునే అవకాశమున్నప్పటికీ, ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆడకపోవచ్చు కూడా. దీంతో త్వరలో జరిగే దక్షిణాఫ్రికా టూర్, జనవరిలో న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల సిరీస్, అలాగే ఫిబ్రవరి-మార్చిలో జరిగే టీ20 వరల్డ్ కప్‌లకు శ్రేయస్ దూరమవడం ఖాయమైంది. తాజాగా జరిగించిన అల్ట్రాసోనోగ్రఫీ పరీక్షల్లో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, కడుపుపై ఒత్తిడి వచ్చే అన్ని కార్యకలాపాలకు దూరంగా ఉండాలని వైద్య నిపుణుడు డాక్టర్ దిన్షా పార్దివాలా సూచించారు. మరి కొన్ని రోజుల తర్వాత మళ్లీ పరీక్షలు చేసిన అనంతరం, బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో పునరావాస శిక్షణ ఎప్పుడు ప్రారంభించాలనే విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. శ్రేయస్ గైర్హాజరీతో భారత్‌కు మిడిల్ ఆర్డర్‌లో ఖాళీ ఏర్పడనుండగా, రాబోయే సిరీస్‌లలో ప్రత్యామ్నాయంగా ఎవరిని తీసుకోబోతున్నారనే దానిపై ఆసక్తి నెలకొంది.

# హల్దీ వేడుకలో వరల్డ్ కప్ విన్నర్స్ సందడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత మహిళా క్రికెట్ జట్టు వైస్‌కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన పెళ్లి సందడి మొదలైంది. తాజాగా జరిగిన తన హల్దీ వేడుక ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంది. హల్దీ వేడుకలో వరల్డ్ కప్ విన్నర్స్ కూడా సందడి చేశారు. నవంబర్ 23న మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్ఛల్‌ను పెళ్లి చేసుకోబోతున్న స్మృతి మంధాన తన భారతీయ క్రికెట్ టీమ్ మేట్స్‌తో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేసింది. మంధాన హల్దీ వేడుక డ్యాన్స్ ఫ్లోర్‌పై ఏకంగా ఏడుగురు భారత క్రికెట్ స్టార్లు హాజరయ్యారు. షఫాలీ వర్మ, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్, శివాలి షిండే, రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్ వంటి ఆటగాళ్లు అందరూ పసుపు దుస్తుల్లో వచ్చి హల్దీలో సందడి చేశారు. అందరూ కలిసి ఉత్సాహంగా పెళ్లి పాటలకు డ్యాన్స్ చేస్తూ, మంధాన పెళ్లి వేడుకను పండుగలా మార్చేశారు. వరల్డ్ కప్ విన్నర్ షఫాలీ వర్మ, ఈ డ్యాన్స్ వీడియోను తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ దానికి లడ్కీ వాలే(వధువు తరపువారు) అని క్యాప్షన్ ఇచ్చింది. ఇదొక చిన్న క్రికెట్ రీయూనియన్‌లా మారింది. ఇటీవల మహిళల వరల్డ్ కప్ గెలిచిన జట్టులోని సభ్యులు షఫాలీ, రాధా, రిచా, రేణుక, జెమీమా అందరూ కలిసి మంధాన పెళ్లి వేడుకలో పాల్గొనడం హైలైట్ గా నిలిచింది.



# విమానాల కొనుగోలుకు రూ.7270 కోట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




దేశీయ విమానయాన రంగంలో ప్రముఖ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) భారీ పెట్టుబడుల దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. విమానాల కొనుగోలు ప్రణాళికలో భాగంగా, తమ అనుబంధ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్‌కి 82 కోట్ల డాలర్లు (సుమారు రూ. 7,270 కోట్లు) అందించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకోసం సంస్థ ఈక్విటీ షేర్లు మరియు నాన్‌క్యుములేటివ్ ఆప్షనల్లీ కన్వర్టిబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు (OCRPS) జారీ చేయనుంది. ఈ షేర్ల జారీని ఒకేసారి లేదా దశలవారీగా చేపట్టవచ్చని ఇండిగో తెలిపింది. సమకూరే ఈ నిధులను ప్రధానంగా కొత్త విమానాల కొనుగోలుకు వినియోగించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇండిగో వద్ద మొత్తం 411 విమానాల ఫ్లీట్ ఉంది. వీటిలో 365 విమానాలు యాక్టివ్‌గా సేవలందిస్తున్నాయని విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్లేన్‌స్పాటర్.నెట్ తెలిపింది. విస్తరణలో భాగంగా మరిన్ని విమానాలను సొంతం చేసుకోవడం ద్వారా తమ నెట్‌వర్క్, సేవలను బలోపేతం చేయాలని ఇండిగో లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా మరియు అంతర్జాతీయంగా వేగంగా పెరుగుతున్న ప్రయాణ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇండిగో తీసుకుంటున్న ఈ తాజా నిర్ణయం విమానయాన రంగంలో మరో కీలక అడుగుగా భావిస్తున్నారు.

# క్రియేటివిటి యువత కెరీర్‌కు శ్రీరామ రక్ష



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెజాన్ ఉద్యోగుల నుంచి తాను ఆశించేదేమిటో సంస్థ అధినేత జెఫ్ బెజోస్ కొద్ది రోజుల క్రితమే స్పష్టంగా తెలిపారు. ఆయన మాటలనే యువత ఫాలో కావాలని నిపుణులు చెబుతున్నారు. నేటి తరం అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కోరుకుంటోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి సంస్థల్లో అనుభవం గడించి సొంత సంస్థలను నెలకొల్పాలనుకునే వారు ఎందరో ఉన్నారు. ఇందుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై మాత్రం చాలామందికి స్పష్టంగా తెలియదు. అయితే, ఈ విషయంలో అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ స్పష్టమైన సూచనలు చేశారు. కొత్తగా ఆలోచించలేని వారు తమ సంస్థలో ఎక్కువకాలం ఉద్యోగం చేయలేరని అన్నారు. తన సంస్థలో చేరాలనుకునే వారికి సృజనాత్మకతతో పాటు వారిని ఒక అంచనా వేసేలా ఇంటర్వ్యూ చేస్తూ వారిని అబ్జర్వ్ చేస్తూనే వారి యొక్క టాలెంట్ ని బేరీజు వేసుకునేలా సాగుతుందని అన్నారు. అప్పటికే అందుబాటులో ఉన్న మార్గాల్లో కాకుండా కొత్త మార్గాన్ని కనుగొనేందుకు ప్రయత్నించే వారివైపు తాను మొగ్గు చూపుతానని అన్నారు. 'నేను అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసేటప్పుడు వారు ఈ మధ్య ఏదైనా కొత్తది కనుగొన్నారా? అని అడుగుతాను. అంటే.. వాళ్లు పేటెంట్ హక్కులు లభించేంత కొత్త విషయాలు కనుక్కోనక్కర్లేదు. సమస్యలను క్రియేటివిటీతో పరిష్కరించే వారుగా ఉండాలి. కొత్తగా ఆలోచించలేని వారు ఎక్కువ కాలం సంస్థలో కొనసాగలేరు' అని స్పష్టంగా చెప్పారు. అపజయం, సృజనాత్మక కవలలని కూడా మరో సందర్భంగా జెఫ్ బెజోస్ వ్యాఖ్యానించారు. ప్రయోగాలు లేకుండా సృజనాత్మకత మనలేదని అన్నారు. యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గణాంకాల ప్రకారం, దేశ జీడీపీలో దాదాపు 50 శాతం సృజనాత్మక కార్యకలాపాల వల్లే వస్తోంది. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, బిల్ గేట్స్ వారందరూ సృజనాత్మకత ఆలంబనగా తమ వ్యాపార సామ్రాజ్యాల్ని నిర్మించుకున్నారు. ఏఐ మనిషిని మించిపోనుందన్న భయాల నడుమ యువత కెరీర్‌కు సృజనాత్మకతే (క్రియేటివిటీ) శ్రీరామరక్ష అని నిపుణులు కామెంట్ చేస్తున్నారు. రేసులో చివరి వరకూ నిలిచేదెవరో సృజనాత్మకతే నిర్ణయిస్తుందని అంటున్నారు.




## కెప్టెన్‌గా వాళ్లిద్దరిలో ఎవరు?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్-సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్ ఈ నెల 26న ముగియనుంది. టెస్టుల తర్వాత రెండు జట్ల మధ్య పరిమిత ఓవర్ల క్రికెట్ మరాథాన్ ప్రారంభం కానుంది. నవంబర్ 30 నుంచి మూడు వన్డేల సిరీస్ మొదలవుతుండగా, డిసెంబర్ 9 నుంచి ఐదు టీ20ల సిరీస్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత సెలక్టర్లు ఆదివారం జాబితా ప్రకటించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. తొలి టెస్టులో మెడ నొప్పితో మైదానాన్ని వీడిన శుభ్‌మన్ గిల్‌కు రాబోయే మ్యాచ్‌ల్లో విశ్రాంతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే టీ20 సిరీస్‌కి సమయానికి పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని సెలక్టర్లు భావిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ స్థానంలో రిషభ్ పంత్ను వన్డే జట్టులోకి తీసుకునే అవకాశముండగా, కేఎల్ రాహుల్‌ను తాత్కాలిక వన్డే కెప్టెన్‌గా నియమించే అంశాన్ని కూడా బీసీసీఐ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గత నెల ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్టులో గాయపడిన శ్రేయస్ అయ్యర్ మార్చి వరకు మైదానాలకు దూరంగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. వన్డే సిరీస్ షెడ్యూల్: 1వ వన్డే నవంబర్ 30 - రాంచీ, 2వ వన్డే డిసెంబర్ 3 - రాయ్‌పూర్, 3వ వన్డే డిసెంబర్ 6 విశాఖపట్నం. టీ20 సిరీస్ షెడ్యూల్: 1వ టీ20 డిసెంబర్ 9 - కటక్, 2వ టీ20 డిసెంబర్ 11 - ముల్లాన్‌పూర్, 3వ టీ20 డిసెంబర్ 14 - ధర్మశాల, 4వ టీ20 డిసెంబర్ 17 - లఖ్‌నవూ, 5వ టీ20 డిసెంబర్ 19 - అహ్మదాబాద్.



## జీవితాన్ని మార్చే ఫార్ములా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని సరిగ్గా వినియోగించుకోవడం అంతే ముఖ్యం. కానీ పెరిగిపోతున్న ధరలు, మారుతున్న జీవనశైలితో చాలామందికి నెలలో ఎంత సంపాదించినా చివరికి ఏమీ మిగలకపోవడం సహజంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా సులభంగా పొదుపు చేయడానికి ఉపయోగపడే పద్ధతి 50/30/20 ఫార్ములా. ఈ ఫార్ములాను అమెరికా సెనెటర్ ఎలిజబెత్ వారెన్ తన పుస్తకం "ఆల్ యువర్ వర్త్: ది అల్టిమేట్ లైఫ్‌టైమ్ మనీ ప్లాన్" లో వివరించారు. ఈ పద్ధతి ప్రకారం మన ఆదాయాన్ని మూడు భాగాలుగా విభజించాలి. అందులో 50 శాతం అవసరాలకు కేటాయించాలి. ఇందులో ఇల్లు అద్దె, కిరాణా, విద్యుత్ బిల్లు, ఆరోగ్యం, బీమా వంటి తప్పనిసరి ఖర్చులు వస్తాయి. తర్వాత 30 శాతం కోరికలకు కేటాయించాలి. అంటే సరదా కోసం చేసే ఖర్చులు,షాపింగ్, రెస్టారెంట్‌లో భోజనం, లగ్జరీ వస్తువులు కొనడం వంటివి. మిగిలిన 20 శాతం మాత్రం తప్పనిసరిగా పొదుపు చేయాలి. ఇది మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్, ఎమర్జెన్సీ ఫండ్ లేదా మీకు అనువైన ఇతర పెట్టుబడుల రూపంలో ఉండొచ్చు. ఉదాహరణకు ,ఒకరి నెలవారీ ఆదాయం రూ. 1 లక్ష అనుకుంటే, రూ. 50,000 అవసరాలకు, రూ. 30,000 కోరికలకు, రూ. 20,000 పొదుపుకు కేటాయించాలి. ఇలా విభజించుకుంటే ఆదాయాన్ని నియంత్రించడం, భవిష్యత్తు కోసం నిధులు సేకరించడం సులభం అవుతుంది. ముఖ్యంగా వ్యక్తి పెళ్లి చేసుకుని, కుటుంబ బాధ్యతలు పెరిగే సమయంలో ఖర్చులు భారీగా పెరుగుతాయి. మీరు ఎంత సంపాదించినా వ్యయ నియంత్రణ లేకపోతే పొదుపు సాధ్యం కాదు. కానీ ఈ ఫార్ములాను క్రమంగా అనుసరిస్తే ఎవరికైనా ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. భవిష్యత్ భద్రత కోసం, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే నిధుల కోసం 50/30/20 ఫార్ములా ఒక సరళమైన, కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి అని నిపుణులు సూచిస్తున్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారతదేశం ఇటీవల రష్యా నుండి ముడి చమురు దిగుమతులు తగ్గించిన సంగతి తెలిసిందే. దీనితో త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. దిగ్గజ రిలయెన్స్ ఇండస్ట్రీస్ కూడా తాజాగా రష్యా దిగుమతులు ఆపేసింది. రష్యా నుండి దిగుమతులు చేసుకునే దేశాలపై అమెరికా భారీగా సుంకాలు విధిస్తుండడంతో భారత్ కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. యూఎస్, పశ్చిమాసియా దేశాల నుండి వచ్చే ఆయిల్ లో దిగుమతి ఖర్చు పెరిగే అవకాశాలుంటాయి. దీనితో రానున్న రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగొచ్చని తెలుస్తోంది.




## డిసెంబర్ 5 నుంచి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

ఇండియాలో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ఓటీటీ జీ 5 వైవిధ్యమైన సినిమాలు, సిరీస్‌లతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ లిస్టులో ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఫన్ ఎంటర్‌టైనర్ 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చేరింది. వెర్సటైల్ యాక్టర్ తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నవంబర్ 7న వచ్చిన చిత్రం 'ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో'. సందీప్ అగరం, అష్మిత రెడ్డి సంయుక్తంగా 7పీఎం ప్రొడక్షన్స్, పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్లపై నిర్మించారు. ఈ చిత్రానికి రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరించారు. తొలి ఆట నుంచే సూపర్ హిట్ టాక్‌తో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. మౌత్ టాక్‌తో అద్భుతమైన స్పందనతో పాటు మంచి మసూళ్లను రాబట్టుకుంది. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'ను గమనిస్తే ఓ చిన్నపాటి విలేజ్‌లో ఉండే ఫొటోగ్రాఫర్ రమేష్ కథ. తను ఆ గ్రామానికి చెందిన లోకల్ లీడర్ ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తాడు. అయితే ఆ మెమరీ కార్డు పోవటంతో అతను పడే ఇబ్బందులు.. ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నాడనే విషయాలను కామెడీ కోణంలో చూపించారు. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. గ్రామంలో మనం చూసే వ్యక్తులను, వారి హావభావాలను దర్శకుడు అందంగా, చక్కగా నవ్వుకునేలా, ఎంజాయ్ చేసేలా ఉండే పాత్రలు అన్నీ ఆడియెన్స్ ను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హీరో తిరువీర్ మాట్లాడుతూ ''ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంలో నేను పోషించిన రమేష్ అనే పాత్ర మనం అందరూ మన టౌన్, గ్రామంలో చూసేలానే ఉంటుంది.

## 'హోమ్‌బౌండ్'కు ఆస్కార్ ఎంట్రీ



ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

భారత్ పక్షాన ఆస్కార్ 2026కు ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ విభాగంలో అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా , జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబర్ లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన ఈ 'హోమ్‌బౌండ్' వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. ఇప్పటి వరకూ చూడని కథేమీ కాదు, తర్వాత ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ రేకెత్తించే మలుపులూ ఉండవు. నెమ్మదిగా సాగినా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. వాస్తవిక కథకు తగ్గట్టే ప్రధాన పాత్రధారులు సహజ నటనతో కట్టిపడేస్తారు. స్నేహితులైన చందన్, షోయబ్‌ల లక్ష్యమేంటన్నది ప్రారంభంలోనే అర్థమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే తీవ్ర పోటీ, పరీక్ష రాసినా ఫలితం తేలకపోతే అభ్యర్థులు పడే మనోవేదన, ఒకవేళ పరీక్షలన్నింటిలో పాస్ అయినా పోస్టింగ్ ఆలస్యం కావడం, చివరకు సర్కారు కొలువుపై ఆశలు వదులుకుని ఏదో ఒక పనిలో చేరడం.. ఇలా మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని కళ్లకు కట్టినట్లు కథలో లీనమయ్యేలా చేశారు దర్శకుడు. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది. లాక్‌డౌన్ వీరిద్దరి జీవితాలను ఎలా ప్రభావితం చేసిందో తెలిపే సన్నివేశాలు హత్తుకుంటాయి. స్నేహితుడి విషయంలో షోయబ్ నిస్సహాయక స్థితి హృదయాన్ని బరువెక్కిస్తుంది. క్లైమాక్స్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇషాన్, విశాల్ ఒకరికొకరు పోటీ పడి నటించారు. సుధా భారతిగా జాన్వీ కపూర్ కనిపించేది కొద్దిసేపే అయినా ఆకట్టుకుంటారు. అభినయానికి స్కోప్ ఉన్న పాత్ర ఆమెది. తొలి సినిమా 'మసాన్'తోనే ప్రపంచవ్యాప్త సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించిన దర్శకుడు నీరజ్ ఘైవాన్.. పదేళ్ల తర్వాత 'హోమ్‌బౌండ్'తో మరోసారి సత్తా చాటారు. ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. 'ఆస్కార్' ఎంట్రీతోపాటు ఇటీవల జరిగిన టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రెండో రన్నరప్‌గా ఇంటర్నేషనల్ పీపుల్స్ ఛాయిస్ అవార్డునూ గెలుచుకుంది. ఎలాంటి కమర్షియల్ హంగుల్లేని ఈ సినిమాని మనసు పెట్టి చూడాల్సిందే..





## 'రాజా సాబ్' నుంచి ఫస్ట్ సాంగ్

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ "రాజా సాబ్" నుంచి ఫస్ట్ సాంగ్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ పాటను ఈ నెల 23న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. "రాజా సాబ్" ఫస్ట్ సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో ప్రభాస్ స్టైలిష్ గా, వింటేజ్ లుక్ లో కనిపిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ తమన్ ఈ సినిమా కోసం క్రేజీ సాంగ్స్ కంపోజ్ చేశారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్ లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా "రాజా సాబ్" ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ఇటీవల రిలీజ్ చేసిన "రాజా సాబ్" ట్రైలర్ హ్యూజ్ రెస్పాన్స్ దక్కించుకుంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ రాజా సాబ్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు రాజా సాబ్ ను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేందుకు వెయిట్ చేస్తున్నారు. నటీనటులు : ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, సంజయ్ దత్, తదితరులు. టెక్నికల్ టీమ్ : ఎడిటింగ్ : కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, మ్యూజిక్ : తమన్, ఫైట్ మాస్టర్ : రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ : ఎస్ కేఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : టీజీ కృతి ప్రసాద్, పీఆర్ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ కాకా, ప్రొడ్యూసర్ : టీజీ విశ్వప్రసాద్, రచన, దర్శకత్వం : మారుతి




## హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ 'రాజు వెడ్స్ రాంబాయి'

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించిన "రాజు వెడ్స్ రాంబాయి" సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని దక్కించుకుంది. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ ఈ సినిమాకు ప్రశంసలు అందిస్తున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చారు. "రాజు వెడ్స్ రాంబాయి" విజయాన్ని అందుకున్న నేపథ్యంలో ఈ చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈటీవీ విన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ తన్మయ్ మాట్లాడుతూ 'రాజు వెడ్స్ రాంబాయి' వెనక మా రెండేళ్ల కష్టం ఉంది. ఈ రోజు ఆ కష్టానికి తగిన ఫలితాన్ని ప్రేక్షకులు ఇచ్చారు అన్నారు. చిత్ర సమర్పకులు డా.నాగేశ్వరరావు పూజారి మాట్లాడుతూ ఈ తరంలోని ప్రతి ప్రేమ జంట చూడాల్సిన చిత్రమిది. ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా ఇది అన్నారు. డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడుతూ మా మూవీ సక్సెస్ తో మాటలు రావడం లేదు. నాకు ఈ వేదికను, ఈ సక్సెస్ ను ఇచ్చిన క్రెడిట్ ఈటీవీ విన్ సాయి, నితిన్ గారిదే అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ రాంబాయి పాట హిట్ అయినప్పుడు సినిమా కూడా పెద్ద సక్సెస్ కావాలని ఎంతోమంది దేవుళ్లకు మొక్కుకున్నా. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే టెక్నీషియన్ కు రెండు మూడేళ్లు కెరీర్ లైఫ్ పెరుగుతుంది.

## 28న రానున్న 'జనతాబార్'

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

ప్రముఖ కథానాయిక రాయ్ లక్ష్మీ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న లేడి ఓరియెంటెడ్ చిత్రం 'జనతాబార్'. రోచి మూవీస్ పతాకంపై రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో అశ్వర్థ నారాయణ సమర్పణలో నిర్మాణం జరుపుకుంటోన్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 28న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రమణ మొగిలి మాట్లాడుతూ '' స్పోర్ట్స్ ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై ఆ స్పోర్ట్స్ విభాగంలో ఉన్న ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న సెక్సువల్ హెరాస్‌మెంట్‌కు చరమగీతం పాడటానికి పోరాడిన ఓ మహిళ కథ ఇది. ఈ చిత్రంలో రాయ్ లక్ష్మీ పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో పాటు సమాజానికి మంచి సందేశంతో పాటు మహిళల్లో చైతన్యం నింపే సినిమా ఇది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ ఈ చిత్రంలో ఎంతో శక్తివంతమైన పాత్రను పోషించాడు. తప్పకుండా ఈచిత్రం కమర్షియల్‌గా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. అమన్ ప్రీతిసింగ్, దీక్షపంత్, శక్తికపూర్, అనూప్‌సోని, ప్రదీప్‌రావత్, సురేష్‌భూపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రాంబాబు గోసాల, కళ్యాణ్ చక్రవర్తి, శ్రీనివాస్‌తేజ, ఫొటోగ్రఫి: చిట్టిబాబు, సంగీతం: వినోద్ యజమాన్య, రచయిత: రాజేంద్ర భరద్వాజ్.



## హారర్ సినిమా చేయాలనుంది

హీరో అల్లరి నరేష్ నటించిన '12A రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పొలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటించారు. 21న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ సినిమా విశేషాలు పంచుకున్నారు.



ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

**నరేష్ గారు '12A రైల్వే కాలనీ' కథలో మీకు నచ్చిన ఎలిమెంట్ ఏంటి?**

ఇది నాకు 63వ రిలీజ్. ఒక కొత్త జానర్ చేద్దామని ఉద్దేశంతో ఉన్నాను. ఇప్పటివరకూ సస్పెన్స్ థ్రిల్లర్ చేయలేదు. ఇందులో పారానార్మల్ టింజ్ చాలా బాగుంటుంది. యదార్థంగా జరిగిన సంఘటన ఆధారంగా తీసిన సినిమా ఇది. హైదరాబాదులో ఆ సంఘటన జరిగింది. దాన్ని సినిమాకు తగ్గట్టుగా చాలా అద్భుతమైన స్క్రీన్ ప్లే తో చేయడం జరిగింది. అనిల్ కథ చెప్పినప్పుడు ఇంటర్వ్యూలో షాక్ అయ్యాను. సెకండ్ హాఫ్ ఎలా ఉండబోతుందో అనిపించింది. మహారాజా సినిమా తీసుకుంటే అందులో స్క్రీన్ ప్లే చాలా డిఫరెంట్ గా ఉంటుంది. ఎక్కడో మొదలైన సీన్ కి చివర్లో కనెక్షన్ ఉంటుంది. అలాగే ఈ సినిమాలో ఒక మూడు నాలుగు కథలు సమాంతరంగా జరుగుతుంటాయి. చాలా మైండ్ గేమ్ ఉంటుంది. ఇలాంటి స్క్రీన్ ప్లే తో తెలుగులో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ఈ సినిమా చూసిన తర్వాత నా కెరీర్ లో ఒక మంచి సినిమా అనే రెస్పాన్స్ ని ఆడియన్స్ ఇస్తారనే నమ్మకం ఉంది. సినిమా విడుదలయ్యాక ఆ నమ్మకం నిజమైంది. ఈ సినిమాలో కార్తీక్ అనే క్యారెక్టర్ లో కనిపిస్తాను. అక్కడ ఒక లోకల్ ఎమెల్యే దగ్గర పని చేస్తుంటాను. తన తలలో నాలుక లాంటివాడు కార్తీక్. అక్కడ ఒక గ్యాంగ్ ఉంటుంది. సరదాగా జరిగిపోతున్నప్పుడు ఒక సంఘటన ఎదురవుతుంది. ఆ సంఘటన తన జీవితంలో ఎలాంటి మలుపు తీసుకుంది అనేది మిగతా కథ.

**ఈ సినిమాకి ఇదే టైటిల్ అనుకున్నారా?**

ఇది 12A అనే ఇంట్లో జరిగే కథ. 12A అనేది ముందే ఫిక్స్ అయ్యాం. తర్వాత ఏ కాలనీ పెట్టాలి అనుకున్నప్పుడు అనిల్ గారు రైల్వే కాలనీ పెడితే అందరికీ కనెక్టింగ్ గా ఉంటుంది అని చెప్పారు. ఇది ఒక రైల్వే కాలనీ బ్యాక్ డ్రాప్ లోనే జరుగుతుంది. ఈ కథకి టైటిల్ పర్ఫెక్ట్.

**హీరోయిన్ కామాక్షి గురించి?**

కామాక్షి గారి నాన్నగారు మా నాన్నగారి దగ్గర వర్క్ చేశారు. తను ఇంటర్ చదువుతున్నప్పుడు నా సినిమాల షూటింగ్ కి వచ్చే వారు. ఇంతకుముందు నా మారేడుమిల్లి సినిమాలో చేసింది. ఈ సినిమాకి ఒక మిడిల్ క్లాస్, పక్కింటి అమ్మాయిలా కనిపించే హీరోయిన్ కావాలి. అనిల్ గారితో కామాక్షి పొలిమేర సినిమా చేసినప్పటికీ కూడా ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఫోటో షూట్ చేశాము. ఈ క్యారెక్టర్ కి పర్ఫెక్ట్ అనుకున్న తర్వాత తీసుకోవడం జరిగింది. తను తెలుగమ్మాయి. భాష పరంగా ఎలాంటి అడ్డంకి ఉండదు. చాలా మంచి ఆర్టిస్టు. తను యాక్టింగ్ తో పాటు డైరెక్షన్ డిపార్ట్ మెంట్ లో కూడా పనిచేసింది అనిల్ గారు కామాక్షి నాని వీళ్లంతా మంచి ఫ్రెండ్స్. తను రైటింగ్ డిపార్ట్ మెంట్లో కూడా ఉంటుంది. మల్టీ టాలెంటెడ్. అనిల్ గారు చాలా ఫాస్ట్ రైటర్ ఏ మార్పులు చెప్పినా చాలా తొందరగా చేస్తారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా వర్క్ షాప్స్ కూడా చేశాం.

**మీరు డైరెక్షన్ చేస్తారని మేము ఎప్పటినుంచో వింటున్నాం?**

నాకు డైరెక్షన్ చేయాలని ఎప్పటినుంచో ఉంది. కానీ దానికి చాలా సమయం కావాలి. ఒక సినిమా డైరెక్షన్ చేస్తాను. అది డిడిఎల్జె లాగా గుర్తుండిపోయే సినిమా కావాలనేది నా కోరిక.

**సీరియస్ క్యారెక్టర్స్ చేయడం చాలెంజింగా.. కామెడీ చేయడం కష్టమా?**

నా వరకు కామెడీ చేయడమే కష్టం. కామెడీ కి చాలా టైమింగ్ కావాలి. అలాగే సీన్ చేస్తున్నప్పుడు కూడా మనం సీరియస్ గా ఉండాలి. చూస్తున్న ఆడియన్స్ కి నవ్వు రావాలి. ఆ టైమింగ్ బ్యాలెన్స్ చేయడం చాలా టఫ్. నాన్నగారు ఎక్కువగా కామెడీ సినిమాలు చేయడంతో నాకు చాలా నేర్చుకునే అవకాశం దొరికింది. అలాగే మన ఇండస్ట్రీలో చాలామంది కమెడియన్స్ ఉన్నారు. వాళ్ళ అందరితో ట్రావెల్ చేయడం నాకు చాలా హెల్ప్ అయింది.

**మీరు ఈ సినిమాలో తెలంగాణ యాస మాట్లాడడం ఎలా అనిపించింది?**

ఇది వరంగల్ లో జరిగే కథ. తెలంగాణ యాస కోసం అజయ్ అనే ఒక వ్యక్తి వచ్చారు. తనతో వర్క్ షాప్ చేశాను. ఫస్ట్ టైం తెలంగాణ యాస మాట్లాడాను. దానిపై చాలా శ్రద్ధ తీసుకున్నాను. నేను ప్రతి సినిమాకి దాదాపు ఒక రోజులో డబ్బింగ్ చెప్పేస్తాను. కానీ ఈ సినిమాకి నాలుగు రోజులు పట్టింది. ప్రతి డైలాగ్ చెక్ చేసుకుంటూ యాస సరిగ్గా పలికేలా కేర్ తీసుకున్నాను.

**భీమ్స్ మీద సూపర్ హిట్ కాంబినేషన్ కదా.. ఆయన ఈ సినిమాకి వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

భీమ్స్ చాలా ట్యాలెంటెడ్. ఐతే చాలా రోజులు తర్వాత తనకి మంచి బ్రేక్ వచ్చింది. మా ఇద్దరికీ థ్రిల్లర్ చేయడం ఇదే ఫస్ట్ టైం. దీన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకున్నాడు. చాలా ప్యాషన్ తో చేశాడు.

**మీరు ఫ్యూచర్ లో ఇంకెలాంటి జోన్స్ చేయాలనుకుంటున్నారు?**


నాకు ఒక హారర్ సినిమా చేయాలనుంది. అలాగే ఒక మూకీ సినిమా చేయాలనుంది. డైలాగ్ లేకుండా నవ్వించాలి అలాంటి స్టోరీ ఎప్పటికైనా ఒకటి చేయాలని ఉంది.

**మీ గత చిత్రం 'బచ్చలమల్లి' ఫలితం మీకు నిరాశపరిచిందా?**

లేదండి. చాలా మంచి సినిమా. ఆ క్యారెక్టర్ అటువంటిది. తనకు ఎన్ని అవకాశాలు వచ్చినా మారని క్యారెక్టర్ అది. ఆ సినిమాకి నాకు చాలా మంచి అప్లాజ్ వచ్చింది. నేను గర్వపడే సినిమా అది.

-ఎం.డి అబ్దుల్

## సీజన్ 2 టీజర్ రిలీజ్



ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ "త్రీ రోజెస్". ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో 'త్రీ రోజెస్' సీజన్ 2 టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ "త్రీ రోజెస్" కాన్సెప్ట్ తో ఎన్ని సిరీస్ లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్ మారుతి గారు ఇచ్చారు. ఆయన రాజా సాబ్ సాంగ్ రిలీజ్ పనుల్లో ఉండి రాలేకపోయారు. టాక్సీవాలా మూవీ చేశాక ఓటీటీలో ఏదైనా కంటెంట్ ప్రొడ్యూస్ చేసేందుకు కావాల్సినంత కాన్ఫిడెన్స్ ఇచ్చింది "త్రీ రోజెస్" సీజన్ 1ను మించిన ఎంటర్ టైన్ మెంట్ ఈ సీజన్ 2 లో చూస్తారు. ఫస్ట్ సీజన్ రవి నంబూరి డైరెక్ట్ చేశాడు. ఇప్పుడు తను మా చెన్నై లవ్ స్టోరీ మూవీ రూపొందిస్తున్నాడు. ఆయన సజెషన్ మీదే కిరణ్ ను డైరెక్టర్ గా , సందీప్ ను రైటర్ గా తీసుకున్నాం. ఈ సిరీస్ లో డిఫరెంట్ క్యారెక్టర్స్ ను సందీప్ క్రియేట్ చేశాడు. డైరెక్టర్ గా కిరణ్ క్రియేటివిటీలో "త్రీ రోజెస్" సీజన్ 2 10శాతం మాత్రమే. తన ప్రతిభను ఫ్యూచర్ లో చూస్తారు. ఈషా మన తెలుగు హీరోయిన్స్ లో ఓజీ అనుకోవచ్చు. రాశీ సింగ్ తెలుగు నేర్చుకుని నటిస్తోంది. కుషిత టాలెంట్ ఉన్న తెలుగు అమ్మాయి. నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తూ వెళ్తున్నాను. కుషిత తమిళంలో, మలయాళంలో మూవీస్ చేస్తోంది. రాశీ డెడికేషన్ ఉన్న నటి. ఆమె ఇంకా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకుంటారు. ఈషా తమిళ, మలయాళం, తెలుగులో మూవీస్ చేస్తున్నారు. అయితే ఇది కంటిన్యుటీ ఉన్న సిరీస్ కాబట్టి ఇతర సినిమాలతో బిజీగా ఉన్నా ఆమె చేస్తానని ముందుకువచ్చింది. సత్య ఈ స్క్రిప్ట్ ను ఇష్టపడి నటించేందుకు వచ్చారు. సత్య ఫస్ట్ వెబ్ సిరీస్ ఇది. అలాగే హర్ష క్యారెక్టర్ కూడా మంచి ఫన్ అందిస్తుంది. అజయ్ అరసాడ మ్యూజిక్ వింటే నాకు దేవి శ్రీ ప్రసాద్ గుర్తొస్తాడు. ఈ సిరీస్ కోసం మంచి మ్యూజిక్ ఇచ్చాడు. డాల్బీ సౌండ్ లో ఈ సిరీస్ చేశాం. మంచి కంటెంట్ ఉంటే వెంటనే ఓకే చెప్పి సపోర్ట్ చేసే ఓటీటీ ఆహా.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**